Truth of News
# సూర్య వాస్తవం
PRGI Reg No: APTEL/26/A4781
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ..

2

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 61 | శుక్రవారం 09 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# జ్ఞానేశ్... గద్దె ఛోడ్

- రాజ్‌ఘాట్‌లో మహాత్ముడి సమాధి వద్ద ప్రార్థనలు
- ఆ నలుగురికి శిక్ష తప్పదు: రాహుల్ గాంధీ
- కన్నాట్ ప్లేస్‌లో ఇండీ కూటమి లంచ్ మీటింగ్
- మోదీ, అమిత్ షాకు జ్ఞానోదయం కలగాలని ప్రార్థనలు
- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో మూడో రోజూ ఢిల్లీలో ఇండీ కూటమి నేతల నిరసన
- ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక
- పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి
- నేడు రాష్ట్రపతిని కలవనున్న ఇండీ కూటమి



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమాన్ని ఆపబోమని ఇండీ కూటమి తేల్చిచెప్పింది. ఆయనకు వ్యతిరేకం గా మూడోరోజు గురువారం కూడా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కూటమి ఎంపీలు, నేతలు ఢిల్లీలో నిరసన బాట పట్టారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, కేసీ వేణులో పాల్, జైరాం రమేశ్‌తోపాటు నేతలంతా ర్యాలీగా రాజ్‌ఘట్‌కు వెళ్లి.. మహాత్ముడి సమాధి వద్ద నివాళులర్పించారు. ఇందులో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా పాల్గొన్నారు.

ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తు న్నారని.. దేశాన్ని హైజాక్ చేయాలని చూస్తున్నారని రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఆ నలుగురికి శిక్ష తప్పదని హెచ్చరించారు. శాంతియుత నిరసనలు చేపడుతుంటే తమ పై పోలీసులతో దాడి చేయిస్తున్నారని.. ఎవరినీ వదిలిపెట్టబోమని వార్నింగ్ ఇచ్చారు.

మంగళవారం పార్లమెంట్ భవన్ నుంచి ఈసీ ఆఫీసుకు ర్యాలీగా బయలుదేరిన 300 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలను పోలీసులు అడ్డుకోగా.. బుధవారం జంతర్‌మంత ర్ వద్ద నిరసనకు ప్రయత్నించగా.. అక్కడా అడ్డుకున్నారు. దీంతో బుధవారం మధ్యా హ్నం కన్నాట్ ప్లేస్ (రాజీవ్ చౌక్)లో లంచ్ మీటింగ్ ఏర్పాటు చేసుకున్నారు. నాలుగు కిలోమీటర్ల దూరంలోని రాజ్‌ఘాట్‌కు ర్యా లీగా వెళ్లి.. మహాత్మునికి నివాళు లర్పించాలని నిర్ణయించారు. దీంతో కన్నాట్ ప్లేస్ నుంచి రాజ్‌ఘాట్ వరకు పోలీసులు భారీ గా మోహరించారు. ప్రతిపక్షాల నిరసనల కారణంగా రెండు రోజులు హైటెన్షన్ వాతావరణం నెలకొనడంతో మరోసారి అలాంటి పరిస్థితి ఏర్పడుతుందని అప్రమత్తమయ్యా రు. మీటింగ్ అనంతరం ఇండీ కూటమి నేతలు వాహనాల్లో ర్యాలీగా రాజ్‌ఘాట్‌కు చేరుకున్నారు. 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' నినాదాలతో పరిసరాలు మార్మోగాయి.

**మహాత్మునికి నివాళులర్పించి..!**

రాజ్‌ఘాట్‌కు చేరుకున్న అనంతరం ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా నేతలంతా అక్కడ మహాత్మాగాంధీ సమాధి వద్ద నివాళు లర్పించారు. కాసేపు మౌనం పాటించారు. రాత్రి ఏడుగంటల వరకు అక్కడే ఉండి తిరుగు ముఖం పట్టారు. నాడు దేశస్వాతంత్ర్య కోసం

- మిగతా 2లో..



## బీజేపీ వ్యతిరేకులే 'సర్' టార్గెట్

- ప్రజల ఓటు హక్కును హరించిన సీఈసీ జ్ఞానేష్
- ప్రజాస్వామ్యాన్ని 'పలుచన' చేస్తున్న ఆ ముగ్గురు
- సీజేపీ నేత అభిజీత్ దీప్కే
- బెంగళూరులో సీజేపీ 'ప్రజాకోర్టు', 'చెప్పుల నిరసన'
- హాజరైన నటుడు ప్రకాష్‌రాజ్, యూట్యూబర్ ధ్రువ్ రాఠీ

బెంగళూరు– సూర్య వాస్తవం

బీజేపీని వ్యతిరేకించే వారే సర్ టార్గెట్ అని, వారి ఓటు హక్కును హరించడానికే ఎస్‌ఐఆర్ కింద ఓటర్ల తొలగింపు జరుగుతోందని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఈసీ ప్రజాస్వా మ్యాన్ని 'పలుచన' చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. మన ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడుకోవడానికి మనం పోరాడాలని స్పష్టం చేశారు. సర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో సర్ ఓట్ల తొలగింపు సమస్య మాత్రమే కాదని, పౌరుల హక్కులు, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడి అని ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ అన్నారు. బెంగళూరులో ఓట్లు కోల్పోయిన బాధితులంతా కలిసి స్థానిక ఫ్రీడమ్ పార్క్‌లో గురవారం ప్రజాకోర్టు (పీపుల్స్ ట్రిబ్యునల్'ను నిర్వహించాయి.

- మిగతా 2లో..



## సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి..

- సుప్రీంకోర్టులో పిటిషన్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్
- ఇద్దరు కమిషనర్ల నియామకం, 2023 చట్టంపైనా పిటిషన్‌లో అభ్యంతరం
- సెలక్షన్ కమిటీ నుంచి సీజేఐని తొలగించడాన్ని ప్రశ్నించిన పిటిషనర్
- సీఈసీ రాజీనామా కోరుతూ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకానికి

- మిగతా 2లో..

## ఉక్రెయిన్‌పై రష్యా రాకెట్ దాడి..

- బస్టాప్‌లో 33 మంది పౌరుల మృతి
- ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి
- తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోస్క్ బస్టాప్‌పై బాంబుల వర్షం
- ఘటనలో 33 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన వైనం
- ఈ ఏడాదిలో ఇదే అతి పెద్ద సింగిల్ అటాక్
- ప్రతీకారం తీర్చుకుంటామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరిక



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

ఉక్రెయిన్‌పై రష్యా మరోమారు క్షిపణి దాడులతో విరుచుకుపడింది. తూర్పు ఉక్రెయిన్‌లోని క్రమటోస్క్ పట్టణంలో రద్దీగా

- మిగతా 2లో..

## బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌కు హైకోర్టులో ఊరట

- పోక్సో కేసుకు సంబంధించి మీడియా ప్రసారాలను నిలిపివేయాలని ఆదేశం
- తన పరువుకు నష్టం కలిగిస్తున్నారని భగీరథ్ పిటిషన్
- సంబంధిత కంటెంట్ తొలగించాలని సోషల్ మీడియా సంస్థలకు సూచన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు పలువురికి నోటీసులు జారీ



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు

- మిగతా 2లో..

## ఏపీ పోర్టుల అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

- మంత్రి సోనోవాల్‌తో సీఎం చంద్రబాబు
- కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి సోనోవాల్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- ఏపీలో సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాలకు సహకరించాలని విజ్ఞప్తి
- మూలపేట, దుగరాజపట్నం పోర్టుల అభివృద్ధిపై కీలక చర్చ
- పోర్టుల అనుబంధ రంగాలతో ఉపాధి కల్పన పెరుగుతుందని వివరణ




న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఢిల్లీలో కేంద్ర ఓడరేవులు, నౌకాయాన శాఖ మంత్రి శర్బానంద సోనో వాల్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాలను విస్తరిం చేందుకు, పోర్టుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఈ భేటీలో ప్రధానంగా రాష్ట్రంలోని పోర్టుల అభివృద్ధి, శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టులో కొత్తగా టెర్మినల్ ఏర్పాటు, దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటు వంటి కీలక అంశాలపై చర్చిం చారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న సుదీర్ఘ తీం ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ, పోర్టుల ఆధారంగా పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చంద్రబాబు కేంద్రమంత్రికి వివరించారు. ఇప్పటికే నిర్మాణంలో

- మిగతా 2లో..



## ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర

- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న సీఎం రేవంత్
- ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణకు బీజేపీ ప్లాన్ అంటూ ఆరోపణలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్
- ఓట్లు తీసేస్తే రేపు రిజర్వేషన్లు కూడా తీసేస్తారని హెచ్చరిక

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# బీజేపీ వ్యతిరేకులే 'సర్' టార్గెట్

(మొదటిపేజీ తరువాయి)

ఈ కార్యక్రమంతో పాటు మహిళలకు మద్దతుగా సీజేపీ 'చెప్పుల నిరసన' చేపట్టింది. మహిళలపై జరుగుతున్న నేరాలను ఖండించింది. ఈ ప్రజాకోర్టు కార్యక్రమంలో సీజేపీ నేత అభిజీత్ దీప్కేతోపాటు ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్, ప్రముఖ యూట్యూబర్, రాజకీయ వ్యాఖ్యా త ధ్రువ్ రాఠీ (రాఠీ) కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీప్కే మాట్లాడుతూ, తమ పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించబడ్డాయని ఆరో పణలు ఎదుర్కొంటున్న ప్రజలు తాము బతికే ఉన్నామని ప్రదర్శించడానికి ఈ కార్యక్రమానికి హాజరయ్యారని అన్నారు. చనిపోయా రని సర్ ప్రకటించిన ప్రజలు ఇక్కడ సజీవంగా నిలబడి ఉన్నారు. కాబట్టి జరిగిన మరణం ఈ ప్రజలది కాదని, ఇది ఈ దేశ ప్రజాస్వామ్యా నికి మరణశాసనం' అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల ఆదేశాల మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌తో సహా ఎన్నికల సంఘం అధికారులు ప్రజల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ భావజాలం సమ్మిళిత భారతదే శాన్ని గానీ, బీఆర్. అంబేద్కర్ లేదా పెరియార్‌ల సిద్ధాంతాలను గానీ విశ్వసించదని, దానికి బదులుగా నాథూరాం గాడ్సేను ఆదర్శంగా తీసుకుంటుందని ఆయన విమర్శించారు.

'మన ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడుకోవడానికి మనం ఆ భావజాలానికి వ్యతిరే కంగా పోరాడాలి' అని పిలుపు ఇచ్చారు. మోదీ తనను మహాత్మా గాంధీ, బీఆర్ అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూతో పోల్చుకో లేరని స్పష్టం చేశా రు. ఓట్లను తొలగించడం ద్వారా నెహ్రూ కంటే ఎక్కువ కాలం అధికారంలో ఉండాలని మోదీ కోరుకుంటున్నా రని ఆరోపించారు. ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ.. సర్ ఓట్ల తొలగింపు సమస్య మాత్రమే కాదని, పౌరుల హక్కులు, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. ఈ నిరసనలకు మద్దతుగా యూట్యూబర్ ధ్రువ్‌రాఠీ గ్రౌండ్ లెవెల్లోకి వచ్చి నేరుగా బహిరంగ నిరసనలో పాల్గొనడం ఇదే మొదటిసారి. అయితే మహిళలపై జరుగుతున్న నేరాలను ఖండిస్తూ, వారికి భద్రత, తగిన చర్యలు కల్పించాలని డిమాం డ్ చేస్తూ సీజేపీ సభ్యులు బెంగళూరులో 'చెప్పుల నిరసన' చేపట్టారు. సీజేపీ నేత అభి జీత్ దిప్కే, సహ-కన్వీనర్ అశుతోష్ రంకా, ప్రతినిధి సౌరవ్‌దాస్ ఈ నిరసనలో పాల్గొని మహిళలకు సంఘీభావం తెలిపారు.

# ఉక్రెయిన్‌పై రష్యా రాకెట్ దాడి..

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న ఒక బస్టాప్‌పై జరిగిన రాకెట్ దాడిలో 33 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడగా, ఈ ఘోర దుర్ఘటనతో ఆ ప్రాంత మంతా భీతావహంగా మారింది. ఈ దాడి ధాటికి బస్టాప్ పరిసరాలన్నీ రక్తసిక్తమయ్యాయి. మృతదేహాలు, శిథిలాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించాయి. ఈ ఏడాదిలో రష్యా జరిపిన దాడుల్లో పౌరులు ఇంత పెద్ద సంఖ్యలో మరణించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ దాడిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. రష్యా ఉద్దేశపూర్వకంగానే పౌరులను లక్ష్యంగా చేసుకుని ఈ ఘాతుకానికి పాల్పడిందని ఆయన ఆరోపించారు. "ఇది ముమ్మాటికీ ఉగ్రవాద చర్య. దీనికి తగిన ప్రతీకారం తీర్చుకుంటాం" అని ఆయన హెచ్చరించారు. అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంటున్న రష్యాపై అంతర్జాతీయ సమాజం ఒత్తిడి పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఘటనతో ఇరు దేశాల మధ్య యుద్ధ ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి.

# బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌కు హైకోర్టులో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి మీడియా, సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న ప్రసారాలను తక్షణమే నిలిపివేయాలని న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. సదరు కేసులో తనకు ఇప్పటికే రెగ్యులర్ బెయిల్ మంజూరైనప్పటికీ, కొన్ని టీవీ ఛానెళ్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ ఆ కేసుకు సంబంధించిన అంశాలను ప్రసారం చేస్తూ తమ కుటుంబ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నాయని ఆరోపిస్తూ భగీరథ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్ ధర్మాసనం విచారణ చేపట్టింది. భగీరథ్ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ వ్యక్తిగత కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను పోక్సో కేసుతో ముడిపెట్టి మీడియా ట్రయల్ నిర్వహిస్తున్నారని, ఇది వ్యక్తిత్వ హననానికి దారితీస్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఉన్న అభ్యంతరకర కంటెంట్‌ను తొలగించి, డిజిటల్ ఆధారాలను భద్రపరచాలని ఆయన కోరారు. వాదనలు విన్న ధర్మాసనం, ఈ కేసుకు సంబంధించి ఎలాంటి కంటెంట్‌ను ప్రసారం చేయవద్దని టీవీ ఛానెళ్లు, ప్రైవేట్ వ్యక్తులు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను ఆదేశించింది. గూగుల్, మెటా, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ సంస్థలు సంబంధిత కంటెంట్‌ను తక్షణమే తొలగించి, డిజిటల్ రికార్డులను భద్రపరచాలని సూచించింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కోరుతూ కేంద్ర సమాచార, ఎలక్ట్రానిక్స్ శాఖలు, తెలంగాణ ప్రభుత్వం, డీజీపీ, సోషల్ మీడియా సంస్థలతో పాటు పలువురు ప్రైవేట్ వ్యక్తులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

# సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి..

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలను సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకం ప్రక్రియకు సంబంధించి తీసుకువచ్చిన 2023 చట్టాన్ని సైతం ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. ముఖ్యంగా కమిషనర్లను ఎంపిక చేసే కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని పిటిషనర్ తీవ్రంగా తప్పుబట్టారు. మరోవైపు, 'సర్' ప్రక్రియను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఒక్కటే తమ అంతిమ లక్ష్యం కాదని, ఆయన స్థానంలో మరొకరు వచ్చినా మార్పు ఉండదని, అందుకే ఆ వివాదాస్పద ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలని నిరసనకారులు స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో సమూల ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి సీజేపీ, వివిధ విద్యార్థి సంఘాలు సుదీర్ఘ పోరాటాలకు పిలుపునిచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించేందుకు సిద్ధమవుతోంది.

# జ్ఞానేశ్... గద్దె ఛోడ్

(మొదటిపేజీ తరువాయి)

మహాత్మాగాంధీ శాంతియుతంగా పోరాటం చేశారని.. ఆయన బాటలోనే ఇప్పుడు తాము మోదీ, అమిత్ షా చేతుల్లో బంధీ అయిన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పోరాడుతున్నామని నేతలు తెలిపారు. చేయబోయే పోరాటం ఏమిటో మీరే చూస్తారని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని కాంగ్రెస్ జనరల సెక్రటరీ కేసీ వేణుగోపాల్ అన్నారు.

**మోదీ, షాకు జ్ఞానోదయం కలగాలి: ఖర్గే**

ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమి త్ షా కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నారని.. వారికి జ్ఞానోదయం కలగాలని రాజ్‌ఘాట్‌లో మహాత్ముడ్ని ప్రార్థించినట్లు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. శాం తియుతంగా నిరసనలు చేపడుతుంటే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వా మ్యాన్ని, రాజ్యాంగాన్ని కాలరాస్తూ ఉం టే ఊరుకోబోమని హెచ్చరించారు. 'స్వాతంత్ర్యంతోపాటు ప్రజల ఓటు హక్కును కూడా కాలరాస్తున్నారు. దేశంలో ఆర్థిక సంక్షోభం కొనసాగుతున్నా, నిరుద్యోగం పెరిగిపోతున్నా మోదీ సర్కార్‌కు పట్టడం లేదు. ఓట్ల చోరీతో దేశాన్ని కబ్జా చేస్తున్నారు' అని ఆయన మండిపడ్డారు.

రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఇండీ కూటమి ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలువనున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి అపాయింట్‌మెంట్ కూ డా తీసుకున్నారు. సీఈసీ జ్ఞానేశ్‌పై వస్తున్న ఆరోపణలను తేల్చాలని డిమాండ్ చేస్తూ తాము శాంతియుతంగా నిరసనలు చేపడుతుంటే అడ్డుకుంటున్నారని రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్లను న్నారు. ఈ కార్యక్రమంలో తా ను కూడా పాల్గొంటానని టీఎంసీ చీఫ్, బెం గాల్ మాజీ సీఎం మమతా వెల్లడించారు.

**వాళ్లను వదిలిపెట్టం**

**ప్రజాస్వామ్యాన్ని మోదీ, షా, భగవత్, జ్ఞానేశ్ ఖూనీ చేస్తున్నారు**

**నిరసనలకు దిగితే అడ్డుకుంటారా?**

**మావాళ్లను పోలీసులతో కొట్టించడమేమిటని ఆగ్రహం**

ఎన్నికల్లో అవక తవకలకు వ్యతిరేకంగా నిరసనలకు దిగితే అడ్డుకోవడం ఏమిటని కేంద్ర ప్రభుత్వా న్ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. 'మంగళవారం 300 మం ది ప్రతిపక్ష ఎంపీలం ఈసీని కలిసేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకున్నారు. బుధవా రం జంతర్ మంతర్ వద్ద నిరసన చేపడు తామంటే అడ్డుకున్నారు. మావాళ్లను కొ ట్టారు. వాళ్లకు శిక్ష తప్పదు' అని హెచ్చ రించారు. గురువారం మూడోరోజు నిరసనలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, మోహన్ భగ వత్, జ్ఞానేశ్‌కుమార్ కలిసి ప్రజాస్వామ్యా న్ని ఖూనీ చేయాలని చూస్తున్నారని.. ఎ న్నికల వ్యవస్థను వారి ఇష్టారాజ్యంగా మార్చుకున్నారని ఆరోపించారు.

# ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు.

ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి ఖాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# ఏపీ పోర్టుల అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న, ప్రతిపాదిత పోర్టులకు అనుసంధానంగా షిప్ బిల్డింగ్, షిప్ రిపేర్, మెరైన్ ఇంజినీరింగ్ వంటి రంగాలను అభివృద్ధి చేస్తే రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు రావడంతో పాటు, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా, శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టు అభివృద్ధి ఉత్తరాంధ్ర రూపురేఖలను మారుస్తుందని, ఈ ప్రాంతంలో వాణిజ్య కార్యకలాపాలకు ఊతమిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అందువల్ల మూలపేట పోర్టుకు అవసరమైన టెర్మినల్, ఇతర మౌలిక వసతుల కల్పనలో కేంద్రం చొరవ చూపి, అవసరమైన సహాయాన్ని అందించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

# 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్

- ఏపీ ప్రతినిధిగా సమావేశానికి హాజరైన ఆర్థిక మంత్రి



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :** న్యూఢిల్లీలోని భారత్ మండపంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన నిర్వహించిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీ పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన జీఎస్టీ విధానాలు, పన్నుల నిర్వహణ, రాష్ట్రాల ఆర్థిక అంశాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధిగా మంత్రి పయ్యావుల కేశవ్ సమావేశానికి హాజరై రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక అంశాలను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు.

# ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ..

- రాష్ట్రాభివృద్ధిపై కీలక వినతులు
- ప్రధాని నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై కీలక ప్రతిపాదన
- 2027 గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి
- రాష్ట్రంలో వర్షాభావం, వ్యవసాయ సంక్షోభంపై ప్రధానికి వివరణ
- విశాఖ మెట్రో, అమరావతి ఓఆర్ఆర్‌కు సహకారం కోరిన సీఎం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి అంశాలపై ప్రధానితో చర్చించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి కష్టాలు తీరతాయని, ఈ బృహత్తర ప్రాజెక్టుపై కేంద్రం దృష్టి సారించాలని చంద్రబాబు కీలక ప్రతిపాదన చేశారు. ప్రధానితో జరిగిన చర్చల్లో భాగంగా, గోదావరి-కావేరి నదుల అనుసంధానం పూర్తయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు సస్యశ్యామలమవుతాయని సీఎం వివరించారు. గతంలో ఎన్డీఏ హయాంలోనే రహదారుల నెట్వర్క్, పవర్ గ్రిడ్ వంటివి సాధ్యమయ్యాయని, అదే స్ఫూర్తితో నదుల అనుసంధానం ద్వారా దేశంలో "వాటర్ గ్రిడ్" ఏర్పాటు చేయాలని సూచించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని, ఈ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించాలని ప్రధానిని కోరారు. రాష్ట్రంలో నెలకొన్న వ్యవసాయ, ఆర్థిక పరిస్థితులను కూడా చంద్రబాబు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 53 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఇది వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపిందని తెలిపారు. కరవు నష్టాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అలాగే, మదనపల్లెలో ప్రారంభించిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు వంటి కార్యక్రమాల గురించి తెలిపారు.

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర సహకారం అందించాలని సీఎం కోరారు. ముఖ్యంగా, రాజధాని అమరావతిలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టును మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2047 నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టే "స్వర్ణాంధ్ర - 2047" విజన్ గురించి కూడా ప్రధానికి వివరించారు. అంతకుముందు, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నందుకు మోదీకి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణ, నిబద్ధత, దూరదృష్టితో దేశాన్ని ప్రపంచ శక్తిగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు.

# విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు.. పెట్టుబడులకు కీలక వేదిక...!

- ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్‌షిప్ ప్రధాన అంశాలుగా సదస్సు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, పరిశ్రమలు,
- సాంకేతిక రంగాలకు మరిన్ని అవకాశాలే లక్ష్యం
- ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



**ఢిల్లీ - సూర్య వాస్తవం :** ఢిల్లీలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌తో పాటు పార్లమెంట్ సభ్యులు పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు ముకుందన్, సీఐఐ డీజీ చంద్ర జిత్ బెనర్జీ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ ఏడాది నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**'ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్‌షిప్'**

ప్రధాన అంశాలుగా జరిగే ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, పరిశ్రమలు, సాంకేతిక రంగాలకు మరిన్ని అవకాశాలను ఆకర్షించే దిశగా కీలక వేదికగా నిలవనుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ఈసీ వర్సెస్ సుప్రీం




భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థనే ఇబ్బందుల్లోకి నెట్టారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశంలో ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ మరియు న్యాయపరమైన వివాదం నడుస్తోంది. ఆయనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, కొంతమంది పౌర సమాజ కార్యకర్తలు ఆరోపణలు గుప్పిస్తుండగా, కోర్టులలో కూడా పిటిషన్లు దాఖలయ్యాయి.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , సెంట్రలైజ్డ్ సాఫ్ట్‌వేర్ విధానాల వల్ల లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మిగిలిన కమిషనర్ల అభ్యంతరాలను పక్కనబెట్టారని కొందరు మాజీ బ్యూరోక్రాట్లు, కార్యకర్తలు ఆరోపిస్తూ ఆయనకు "పబ్లిక్ ఇంపీచ్‌మెంట్ నోటీస్" పంపేందుకు ప్రయత్నించారు.జ్ఞానేశ్ కుమార్ ను సీఈసీ పదవి నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలంటూ దాఖలైన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత సంస్థ చట్టానికి లోబడే పనిచేస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలను సమీక్షించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది.మరొకవైపు కేంద్ర ఎన్నికల సంఘం తమపై వస్తున్న అంతర్గత విభేదాల వార్తలను ఖండించింది. గత ఏడాది కాలంగా తీసుకున్న నిర్ణయాలన్నీ కమిషనర్లందరి సమ్మతితో ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది.అలాగే పారదర్శకతను పెంచేందుకు వీలుగా సమావేశాల అజెండాలను ముందే పంచుకోవడం, మినిట్స్ విడుదల చేయడం వంటి కొత్త మార్పులను కూడా ఈసీ ప్రకటించింభారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ హయాంలో ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించడం, ఫారమ్-6 నిబంధనలలో మార్పులు చేయడం వంటి కీలక నిర్ణయాలను మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి లు వ్యతిరేకించినప్పటికీ, జ్ఞానేశ్ కుమార్ ఒంటెత్తు పోకడలతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దాదాపు 14 సార్లు సహచర కమిషనర్లు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఫారం 6 వివాదం ముదురుతోంది. ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటే వాటిని రద్దు చేస్తామని తాజాగా సుప్రీం కోర్టు చేసిన హెచ్చరికలతో ఈసీ చిక్కుల్లో పడింది. ఫారం-6 సవరణలను తాము ఆమోదించలేదని, అవి చట్టవ్యతిరేకంగా ఉంటే రద్దు చేస్తామని నిన్న (సోమవారం) సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించిన విషయం తెలిసిందే. ఫారం-6ను కొత్త ఓటర్ల నమోదు కోసం వినియోగిస్తారు. అయితే దీనిలో ఏకపక్షంగా సవరణలు చేశారని దేశవ్యాప్తంగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకునేవారు ఫారం 6లో.. గత ఎస్ఐఆర్‌లో తమ పేరు/ తల్లిదండ్రుల పేరు/ తాత, నానమ్మల పేరు ఉందా అన్న విషయం తెలపాలంటూ ఈసీ సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేశారంటూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై సుప్రీం కోర్టు ఘాటుగా స్పందించింది. ఆ సవరణలను తాము ఆమోదించలేదని స్పష్టం చేసింది.మరోవైపు ఫారం-6 ఎలాంటి సవరణలూ చేయలేదని ఎన్నికల సంఘం కోర్టులో వాదించింది. తాము అదనంగా ఒక డిక్లరేషన్‌ను సమర్పించాలని ఆదేశాలు జారీ చేశామని చెప్పింది. పైగా ఈ మార్పులను బిహార్ 'సర్'పై ఇచ్చిన మే నెల తీర్పులో సుప్రీం కోర్టు కూడా సమర్థించిందని తెలిపింది.కాగా.. ఈసీఐ అధికారిక పోర్టల్‌లో ఫారం-6కు దరఖాస్తు చేసుకోవాలంటే ఈ అదనపు డిక్లరేషన్ తప్పనిసరిగా జతచేయాలి. ఇందుకోసం ఆ పోర్టల్‌లో 'ఫిల్ ఫారం-6', 'ఫిల్ డిక్లరేషన్' అని రెండు ఆప్షన్లు ఉంటాయి. ఇప్పుడు దీనిపై వివాదం రాజుకోవడంతో డిక్లరేషన్ ఆప్షన్‌ను ఈసీ తొలగించింది. ఇప్పుడు దీన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది, ఎవరి ఆదేశాలతో ఆ పత్రాన్ని తప్పనిసరి చేశారని ప్రశ్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఈసీ పలు న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముంది.ఈ వ్యవహారం అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా ఉందంటూ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా ఇండి కూటమి నేతలు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ఒక బహుళ సభ్యుల కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం సహజమని, అంతిమ నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే జరిగాయని వివరణ ఇచ్చింది. మరో వైపు ఏఐఎంఐఎం ప్రెసిడెంట్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఈ విషయంపై స్పందించారు. ఫామ్ 7 దరఖాస్తుల పేరుతో ఓట్లు తొలగించాలని చూస్తే పెద్దఎత్తున ఆందోళనలకు దిగుమతామని హెచ్చరించారు. ఫామ్ 7 పేరుతో తప్పుడు దరఖాస్తులు లేదా అప్పీళు సమర్పిస్తే వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి" అని కోరారు.ఈ అంశంపై ఎన్నికల సంఘం కూడా స్పందించింది."ఫామ్ 7 దరఖాస్తుల విషయంలో అనర్హమైనవి సమర్పిస్తే తగిన చర్యలు తీసుకోవాలి" అని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి జిల్లాల కలెక్టర్లకు సూచించారు.మరోవైపు, 'సర్' ప్రక్రియలో భాగంగా కర్ణాటకలో ఫామ్ 7 కింద దాదాపు నాలుగువేలకు పైగా ఓటర్ల పేర్లు తొలగించారని,వారిలో ఎక్కువ మంది ముస్లిం ఓటర్లు ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. .మొత్తం మీద జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థను గబ్బు పట్టించారన్న ఆరోపణలయితే దేశ వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో విపక్షాలు సక్సెస్ అయ్యాయి. జ్ఞానేశ్ కుమార్ మీ తాత, అమ్మమ్మల ఓటర్ల కార్డు ఐడీ నెంబరు చెబుతావా? అంటూ నెట్టింట కామెంట్స్ కూడా పెడుతున్నారు.

# కమిషనర్ కే. కన్నబాబుకు క్యాప్కో ప్రతినిధుల మెమోరాండం

- రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలిని ఏర్పాటు చేయాలి
- ధరల నియంత్రణ కమిటీల్లో వినియోగదారుల సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి
- ధరల నియంత్రణ కమిటీల్లో వినియోగదారుల సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి
- క్యాప్కో చైర్మన్ జి. సురేష్ కుమార్ డిమాండ్



**విజయవాడ - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలిని సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాప్కో) చైర్మన్ జి. సురేష్ కుమార్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, సివిల్ సప్లైస్ కమిషనర్ కే. కన్నబాబును విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి క్యాప్కో ఆధ్వర్యంలో మెమోరాండం సమర్పించారు.ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వినియోగదారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముఖ్యంగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ, ఆహార కల్తీ, ధరల నియంత్రణ, లీగల్ మెట్రాలజీ, ప్రజా పంపిణీ వ్యవస్థ, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు, మార్కెట్ పరిస్థితులు, అధిక ధరలు, వినియోగదారులపై పడుతున్న ఆర్థిక భారాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి ధరల నియంత్రణ, పర్యవేక్షణ కమిటీల్లో వినియోగదారుల సంఘాల ప్రతినిధులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరినట్లు తెలిపారు. వినియోగదారుల సంఘాలు క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం గుర్తిస్తున్నాయని, వారి ప్రతినిధులు కమిటీల్లో సభ్యులుగా ఉంటే అధిక ధరలు, కృత్రిమ కొరత, అక్రమ నిల్వలు, వినియోగదారుల దోపిడీ వంటి అంశాలపై వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి తెలియజేయడంతో పాటు పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా సాగుతుందని అన్నారు.రాష్ట్ర స్థాయిలో వినియోగదారుల సమస్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రభుత్వానికి సూచనలు, సిఫారసులు అందించేందుకు రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి కీలక వేదికగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పనిచేసే సంబంధిత కమిటీల్లో వినియోగదారుల సంఘాలకు అధికారిక ప్రాతినిధ్యం కల్పించాలని క్యాప్కో కోరినట్లు తెలిపారు.ప్రభుత్వం, అధికార యంత్రాంగం, వినియోగదారుల సంఘాలు సమన్వయంతో పనిచేసినప్పుడే బలమైన వినియోగదారుల రక్షణ వ్యవస్థను నిర్మించగలమని సురేష్ కుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్యాప్కో గౌరవ అధ్యక్షులు ఎం. నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ కర్లపాటి వెంకట శ్రీనివాసరావు, మచిలీపట్నం జిల్లా అధ్యక్షులు సైకం భాస్కర్ రావు పాల్గొన్నారు.

# పిచ్చి మొక్కల మధ్య నిరుపయోగంగా వాటర్ ట్యాంక్

## - ఎగువపల్లి గ్రామ ప్రజలకు దాహార్తిని తీర్చండి మహాప్రభో





**గార్లదిన్నె - సూర్య వాస్తవం :** గార్లదిన్నె మండలంలోని ఎగువపల్లి గ్రామానికి ప్రజల దాహార్తిని తీర్చుటకు 26 లక్షలు వ్యయంతో వాటర్ ట్యాంక్ నిర్మించారు. కానీ వాటి నుంచే కల్లూరు ఆర్ఎస్ గ్రామానికి నీటి సరఫరా చేస్తున్నందున మాగ్రామానికి నీటి కొరత తీవ్రంగా ఏర్పడిందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, నాయకులు మాట్లాడుతూ త్రాగు నీరు సమస్య పరిష్కార నిమిత్తమై సింగనమల నియోజకవర్గం,ఇప్పటి వైసీపీ సమన్వయకర్త డాక్టర్ శైలజనాథ్ మంత్రిగా ఉన్నప్పుడు ఎగువపల్లి గ్రామ ప్రజలు నీటి ఎద్దడిని పరిష్కరించాలని ఎన్నో దఫాలుగా ఆయనతో కలిసి విన్నవించుకోవడంతో ఎగువపల్లి హెచ్ఎల్సీ కాలనీలో ఓవర్ హెడ్ నీటి ట్యాంకు మంజూరు చేయడం జరిగిందని,వాటర్ ట్యాంక్ నిర్మాణానికి 13 లక్షలు, పెన్నా నది నుంచి మోటార్ పైపులైన్ ఏర్పాటుకు 13లక్షలు మంజూరు చేయడంతో అప్పటినుండి ఇప్పటివరకు ప్రతిరోజు ఉదయం సాయంత్రం నీరు సరఫరా జరుగుతుండేదని, అలాంటి సౌకర్యంను కొందరు రాజకీయ నాయకుల ప్రమేయంతో పంచాయతీ అధికారులు గ్రామ ప్రజలను మోసగించి మా గ్రామంలో యొక్క వాటర్ ట్యాంక్ నుంచి కల్లూరు ఆర్ఎస్ గ్రామానికి నీరు సరఫరా చేయడంతో మా గ్రామానికి నీరు సరిగా సరఫరా చేయడం లేదని ఎగువపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. రోజుకు రెండు పూటలా నీరు సరఫరా చేసేవారు ఇప్పుడు మూడు రోజులకు ఒక్క పూట, గంటసేపు కూడా సరిగా నీరు విడుదల చేయడంలేదని, దాదాపు నాలుగు వేల జనాభాతో పాటు పదివేలకు పైగా పశువులు మూగజీవాలు దాహార్తితో తల్లడిల్లి పోతున్నాయని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. పంచాయతీ కార్యాలయంలో అధికారులను నిలదీస్తే మోటర్ చెడిపో యిందని, పైప్ లైన్ పగిలిపోయిందని, వైర్లు కాలిపోయాయని ఇలా ఏదో ఒక సాగు చెప్పుకుంటూ ఒక్కొక్కసారి నీరు రావడానికి వారానికొక సారి సరఫరా చేయకుండా ఉన్నారని ప్రజల ఆగ్రహాన్ని వ్యక్తపరుస్తున్నారు. సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే స్పందించి మా గ్రామానికి యధా ప్రకారం నీరు సరఫరా అయ్యేటట్లు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏకే నరసింహులు నల్లపరెడ్డి అశోక్ కుమార్ పిల్లల గంగాధర్ వీరయ్య రామకృష్ణ మాజీ ఎంపీటీసీ రవి కమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాలలోనూ, గుత్తి టౌన్‌లోను నాకాబంది

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి అనంతపూర్ జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపిఎస్ ఆదేశాల మేరకు గుంతకల్ డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో గుత్తి సీఐ రామారావు, ఎస్సైలు సురేష్, అమీర్ ఖాన్, సిబ్బందితో, స్పెషల్ ఫోర్స్ తో గుత్తి మండలంలోని సమ స్యాత్మక గ్రామాలైన తొండ పాడు గ్రామం,జక్కలచెరు వు గ్రామం,గుత్తి టౌన్ లోని ఎస్సీ కాలనీ, బండ గేరి, కోట ఏరియా, బస్టాండ్ ఏరియా లలో నాకాబంది నిర్వహించి అనుమానితుల ఇళ్లను, రౌడీషీటర్ల ఇండ్లను తనిఖీ చేసి, అనుమానాస్ప దంగా ఉన్న రెండు మోటార్ వాహనాలను సీజ్ చేసి,పై ప్రదేశాలలో అంతట ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించడం జరిగినది.అదేవిధంగా గ్రామ సభలు నిర్వహించి రాబోయే ఎన్నికలలో ఎటువంటి గొడవలకు తావివ్వకుండా సామరస్యంగా, ప్రశాంతంగా ఎన్నికలు ముగిం చడానికి సహక రించాలని తెలియజేశారు. ఎవరైనా గొడవలకు ప్రోత్స హించిన,పాల్గొనిన చట్టపర మైన కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఉచిత కంటి, బీపీ పరీక్షల శిబిరం




**పామిడి- సూర్య వాస్తవం :** ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పామిడిలోని లక్ష్మీ హాస్పిటల్లో ఉచిత కంటి రక్తపోటు (బీపీ) పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జోనల్ చైర్‌పర్సన్ లయన్ క్లబ్ డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు జిల్లా చైర్మన్ పి.ఎస్. జయరాం ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అంజి నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని క్రమం తప్పకుండా పరీక్షలు చేయించు కోవడం ద్వారా దృష్టి లోపాలను ముందే నివారించవచ్చని సూచించారు. అనంతరం డాక్టర్ అంజి నాయక్ ఆధ్వర్యంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరంలో పట్టణ, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచితంగా కంటి పరీక్షలు, బీపీ టెస్టింగ్ చేయించుకున్నారు.లక్ష్మీ హాస్పిటల్ యాజమాన్యం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సిబ్బంది రోగులకు అవసరమైన సేవలను అందించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## రాహుల్, ప్రియాంక అరెస్టులకు... నిరసనగా బ్లాక్ డే...!

**- రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన**
**- "దేశ్ బచావో--ఓట్ బచావో" నినాదాలతో హోరెత్తిన నిరసన**
**- ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్**
**- రాష్ట్ర జనరల్ సెక్రటరీ నవాజ్ సాహెబ్**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలపై జరిగిన అరెస్టులను నిరసిస్తూ, రాజ్యాంగ హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు.రాష్ట్ర జనరల్ సెక్రటరీ నవాజ్ సాహెబ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యవహారశైలిపై నిరసన వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాలు వాస్తవాలను ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నాయకులు పేర్కొన్నారు. పోలీసుల వ్యవహారశైలిని కూడా వారు తప్పుబట్టారు.అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. "దేశ్ బచావో -- ఓట్ బచావో", "ఓట్ చోర్ గద్దీ ఛోడో" వంటి నినాదాలతో నిరసన తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజల ఓటు హక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడితో ఎమ్మెల్యే దగ్గుపాటి చర్చలు

**- అనంతపురం రాజకీయ పరిస్థితులపై రాష్ట్ర అధ్యక్షుడితో సమాలోచన**
**- మేయర్, మున్సిపల్ స్థానాలు, పంచాయతీల్లో విజయమే లక్ష్యం**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** విజయవాడ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావును మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర మంత్రి సవిత, సహచర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన రాష్ట్ర అధ్యక్షుడితో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, అనంతపురం నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులు, స్థానికంగా నెలకొన్న పరిణామాలపై చర్చించారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచి ప్రజల్లోకి మరింత విస్తృతంగా వెళ్లేలా కార్యాచరణ రూపొందించడం వంటి అంశాలపై చర్చ జరిగినట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులను పూర్తి స్థాయిలో సమాయత్తం చేయాలని, క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పల్లా శ్రీనివాసరావు దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ పరిధిలో మేయర్, మున్సిపల్ స్థానాలతో పాటు పంచాయతీల్లోనూ టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## గుండెపోటుతో ఎన్నికల డేటా ఎంట్రీ ఆపరేటర్ మృతి

**- మృతుడి కుటుంబానికి ఔట్‌సోర్సింగ్, రెవెన్యూ సంఘాల అండ**
**- జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.80 వేల ఆర్థిక సహాయం**
**- సహాయం అందించిన సంఘాల ప్రతినిధులను అభినందించిన కలెక్టర్**
**- కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా : ఆర్.ఎన్. దివాకర్ రావు**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్ మండలంలో ఎన్నికల డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతిచెందిన సి. ప్రశాంత్ కుమార్ కుటుంబానికి ఔట్‌సోర్సింగ్ సంఘం, రెవెన్యూ సంఘం సంయుక్తంగా రూ.80 వేల ఆర్థిక సహాయం అందించాయి.జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఐఏఎస్ మృతుడి కుటుంబ సభ్యులకు రూ.80 వేల సహాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో కుటుంబానికి అండగా నిలిచిన ఔట్‌సోర్సింగ్, రెవెన్యూ సంఘాల ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు.ఉద్యోగి కుటుంబానికి మానవతా దృక్పథంతో సహాయం అందించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏ. మలోల, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కోశాధికారి ఆర్.ఎన్. దివాకర్ రావు, ఎన్నికల సీనియర్ సహాయకుడు శామ్యూల్, ఎన్నికల ఆపరేటర్ల అధ్యక్షుడు ఏ. ఇంతియాజ్, ఔట్‌సోర్సింగ్ సంఘం అధ్యక్షుడు భాస్కర్ నాయుడు, మృతుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**- ఓటరు జాబితా అవకతవకలపై కాంగ్రెస్ ఆందోళన..**
**- ఎస్ఐఆర్ ప్రక్రియ నిలిపివేయాలని డిమాండ్**



**హిందూపురం - సూర్యవాస్తవం :** హిందూపురం పట్టణంలో ఓటరు జాబితా ప్రక్రియలో జరుగుతున్న అవకత వకలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఓటరు జాబితా ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపి వేయాలని నాయకులు డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీపీఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఏఐసీసీ సభ్యుడు కేటీ శ్రీధర్, మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ నాయకులు కార్యక్రమానికి మద్దతు తెలిపారు.ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ఓటరు జాబితా తయారీ, సవరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఓటర్ల పేర్ల తొలగింపు, చేర్పులు, సవరణల విషయంలో స్పష్టత, పారదర్శకత పాటించాలని కోరారు.ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం వాస్తవాలను ప్రజలకు స్పష్టంగా తెలియ జేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఓటరు జాబితా ప్రక్రియలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాజకీయ పార్టీలు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు షామీర్ భాష, హిందూపురం కాంగ్రెస్ నాయకులు నాగరాజు, సమద్ షాహిన్, శ్యామ్ కిరణ్, అమానుల్లా, జమీల్, పాలసముద్రం నరసింహులు, రవుఫ్, తిరుపాల్, భాష తదితరులు పాల్గొన్నారు. సీపీఐ హిందూపురం కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్, సహాయ కార్యదర్శి మారుతిరెడ్డి, కార్యవర్గ సభ్యులు నరసింహమూర్తి, సమీవుల్లా, చాంద్ బాషా, కమల్ భాష, ఎన్ఎస్‌యూఐ హిందూపురం నాయకుడు భరత్‌తో పాటు కాంగ్రెస్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని సమాచార పౌర సంబంధాల శాఖ కళాబృందం కళాకారులు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా హార్టికల్చర్ క్లస్టర్లలో ప్రతిరోజు రెండు గ్రామాలు చొప్పున కళాజాత కార్యక్రమాలను చేపట్టారు. గురువారం సాయంత్రం రాయదుర్గం మండలంలోని 74 ఉడే గోళం ఆవుల దట్లలో కళాజాత ప్రదర్శన ద్వారా ఉద్యాన పంటల సాగుపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే "రైతే రాజు " ఆధునిక వీధి నాటకం జానపద గేయాలతో ప్రభుత్వం రూపొందించిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ రైతులు ,యువత, ప్రజలకు చైతన్యపరిచారు. ఈ సందర్భంగా రాయలసీమ ఉద్యాన పంట సాగుతో ప్రపంచ స్థాయికి ఎగుమతి చేసే దిశగా సుమారు రూ 1 .కోట్ల లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ను అభివృద్ధి చేసి రైతును ప్రోత్సహించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కళా బృందం వివరించింది.

ముఖ్యంగా రైతులు సాంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని తద్వారా అధిక ఆదాయంతో లబ్ధి పొందవచ్చునని ప్రచార కార్యక్రమంలో కళాకారులు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సహించేందుకు రాయలసీమలో హార్టికల్చర్ గ్లోబల్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని, అక్టోబర్ 2న గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని ఇందులో భాగంగా రైతులు యువత ప్రజలకు వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతున్నట్లు తెలిపారు. ఉద్యాన పంట సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ,నూతన సాగు పద్ధతులు, పంటల ఎంపిక, ఉత్పత్తుల నాణ్యత, మార్కెటింగ్ తదితర అంశాలపై కళాకారులు చైతన్య పరుస్తున్నారు. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఉద్యాన పంట సాగుతో రైతులు పంటల వైవిధ్యాన్ని పెంపొందించుకొని మెరుగైన ఆదాయాన్ని పొందాలని కళాకారులు తమదైన శైలిలో కళా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సమాచార శాఖ ఎ పి ఆర్ఓ ఫక్రుద్దీన్, స్థానిక నాయకులు హనుమంతు, పురుషోత్తం ఓబయ్య తిప్పే స్వామి, సరస్వతి అని మేటార్ కవిత , వెంకటేష్ కళాబృందం కళాకారులు వెంకటేష్ ,సరోజ, నాగేంద్ర జంగం శ్రీనివాసులు, నరసింహులు, జాన్ తదితరులు పాల్గొన్నారు.

# టీబీ నిర్మూలనకు జోష్ టీమ్ కీలకంగా పనిచేయాలి

**- 11 మంది సభ్యులతో జోష్ టీమ్ ఏర్పాటు.. ఎన్‌సీసీ, మై భారత్ వాలంటీర్లకు కీలక బాధ్యతలు**
**- టీబీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే జోష్ టీమ్ లక్ష్యం**
**- టీబీ బాధితులకు నిక్షయ్ మిత్రలుగా అండగా నిలవాలి : డీఎంహెచ్ఓ**



**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం :** అనంతపురం టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జాయింట్ స్క్వాడ్ ఫర్ హెల్త్ (జోష్ ) టీమ్ లాంచ్ కార్యక్రమాన్ని గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. టీబీపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు టీబీ బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించడమే జోష్ టీమ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ బృందంలో మొత్తం 11 మంది సభ్యులు ఉంటారని, ఒక క్లాస్-1 నోడల్ అధికారితో పాటు ఎంపీడీవో, ఐదుగురు ఎన్‌సీసీ విద్యార్థులు, ఐదుగురు మై భారత్ వాలంటీర్లు సభ్యులుగా ఉంటారని వివరించారు. టీబీ బాధితులకు నిక్షయ్ మిత్రలుగా అండగా నిలిచి, వారికి సైకో-సోషల్ సపోర్ట్ అందించడంతో పాటు చికిత్స సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. టీబీ నిర్మూలన లక్ష్య సాధనలో జోష్ టీమ్‌లు సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు.

కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారందరితో టీబీ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టీబీ నివారణ అధికారి డాక్టర్ జయలక్ష్మి, వైద్య కళాశాల నుంచి డాక్టర్ అశోక్ కుమార్, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు, టీబీ చాంపియన్స్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# విదేశీయుల వసతి వివరాలు....
## ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి...!

- పాస్‌పోర్ట్, వీసా వివరాలు పరిశీలించాకే వసతి కల్పించాలి
- హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, విద్యాసంస్థలకు ఎస్పీ సూచన
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు ఎస్పీ పి. జగదీష్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం విదేశీ పౌరులకు వసతి కల్పించే హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, విద్యాసంస్థలు తదితర నిర్వాహకులు వారి వివరాలను సంబంధిత అధికారిక ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫారం-సీ/ ఫారం--3 ద్వారా తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ సూచించారు.విదేశీయులకు వసతి కల్పించే ముందు వారి పాస్‌పోర్ట్, వీసా వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచిం చారు. అలాగే విదేశీ పౌరుల రాక, నిష్క్రమణ వివరాలను కూడా సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు.నిబంధనలను ఉల్లంఘించినా, తప్పుడు సమాచారం అందించినా లేదా చట్టవిరుద్ధంగా వసతి కల్పించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటా మని ఎస్పీ హెచ్చరించారు. నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు పోలీసులు నిరం తరం తనిఖీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.విదేశీ పౌరులకు వసతి కల్పించే నిర్వాహకులు ఇమ్మిగ్రేషన్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ కోరారు.

# ప్రభుత్వ ఆస్పత్రికి 25 వీల్‌చైర్లు అందజేత

- 'జనం కోసం.. గిఫ్ట్ ఏ వీల్‌చైర్' కార్యక్రమానికి శ్రీకారం
- ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలి
- సామాజిక సేవా కార్యకర్త డిస్కవర్ అనిల్



**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం :** అనంతపురం ఏజీఎస్ ఫౌండేషన్, సామాజిక సేవా సంస్థ డిస్కవర్ (అనంతపురం) సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రికి 25 వీల్‌చైర్లను అందజేశారు. 'జనం కోసం.. గిఫ్ట్ ఏ వీల్‌చైర్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఏజీఎస్ ఫౌండేషన్ అధ్యక్షురాలు ప్రమీలరెడ్డి, డిస్కవర్ సామాజిక సేవా కార్యకర్త అనిల్ తెలిపారు. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతిరోజూ ఎంతో మంది రోగులు వస్తుంటారని, వారికి అవసరమైన సమయంలో వీల్‌చైర్లు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి ఈ కార్యక్రమానికి ముందుకు వచ్చినట్లు వారు తెలిపారు.ప్రభుత్వ ఆస్పత్రికి తమవంతుగా సహాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, ప్రజలు, సేవా సంస్థలు తమకు సాధ్యమైన రీతిలో ఆస్పత్రికి సహకరించాలని పిలుపునిచ్చారు.

### పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో పాల్గొన్న
## గుత్తి, పామిడి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈ శ్వర్
## కార్మిక శాఖ బోర్డు చైర్మన్‌వెంకట శివుడు యాదవ్



**గుత్తి - సూర్య వాస్తవం :** పట్టణంలోని 11వ వార్డులో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా 11 లక్షల రూపాయలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థులుగా గుంతకల్ నియోజ కవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తన యుడు యువనేత గుత్తి, పామిడి ఇంచార్జ్ గుమ్మనూ రు ఈశ్వర్ మరియు కార్మిక శాఖ బోర్డు చైర్మన్ శ్రీ వెంకట శివుడు యాదవ్ హాజర య్యారు.ఈ సందర్భంగా 11వ వార్డు నాయకులు, ప్రజలు గుమ్మనూరు ఈశ్వర్ కి మరియు వెంకట శివుడు యాదవ్‌కి పూల మాలవేసి శాలువా కప్పి ఘ నంగా సన్మానించడం జరి గింది.అనంతరం అక్కడ నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొని సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా యువ నేత గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ టిడిపి అంటే తెలుగు దేశం డెవలప్మెంట్ పార్టీ అని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి చ్చి రెండున్నర సంవత్సరాలు గడిచింది.ఈ రెండున్నర సంవత్సరాలలో ఎన్నో అభి వృద్ధి కార్యక్రమాలు గుంతకల్ నియోజకవర్గంలో ము ఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని ఇంకా రాబోయే రోజుల్లో కూడా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడుపుతామని ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు ముఖ్య నాయకులు కార్యకర్తలు, గుత్తి పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు వైసీపీ శంఖారావం

- హంద్రీ--నీవా కాలువ లైనింగ్‌తో రైతులకు నష్టం జరుగుతోందని ఆరోపణ
- పేరూరు డ్యామ్‌కు నీటి విషయంలో ప్రభుత్వంపై విమర్శలు
- ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త పట్టుదలతో పనిచేయాలి
- ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరేయాలి: తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



**అనంతపురం ప్రత్యేక ప్రతినిధి - సూర్య వాస్తవం :** ఆత్మకూరు స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలని, ఆత్మకూరు మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరేసేలా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండలంలోని కనకదాసు కళ్యాణ మండపంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. పరిటాల సునీత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఆత్మకూరు చెరువుకు నీరు తీసుకొస్తామని హామీలు ఇవ్వడం, ఎన్నికలు పూర్తయిన తర్వాత వాటిని పక్కన పెట్టడం అలవాటుగా మారిందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో పీఏబీఆర్ డ్యామ్ నుంచి ఆత్మకూరుకు తాగునీరు అందించేందుకు చేపట్టిన పైప్‌లైన్ పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా మిగిలిన పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.మహిళలు, దళితులపై జరిగిన పలు ఘటనల్లో స్థానిక ఎమ్మెల్యే స్పందించలేదని ప్రకాష్ రెడ్డి విమర్శించారు. బాధిత కుటుంబాలను పరామర్శించడంలో కూడా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. గతంలో జరిగిన పలు ఘటనలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం, అధికార పార్టీ నేతల తీరుపై ఆయన విమర్శలు చేశారు.హంద్రీ--నీవా కాలువ లైనింగ్ పనుల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పలు ప్రాంతాల్లో బోర్లలో నీటి లభ్యత తగ్గిపోయిందని ఆరోపించారు. కాలువ లైనింగ్ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు.

తాను అధికారంలో ఉన్న సమయంలో పేరూరు డ్యామ్‌కు నీరు తీసుకు రావడానికి కృషి చేశానని, ప్రస్తుతం పేరూరు డ్యామ్ ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ప్రకాష్ రెడ్డి కోరారు. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేసి, వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేయాలని పిలుపునిచ్చారు.

### స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు
# ప్రతి ఒక్కరూ సహకరించాలి : సీఐ దేవనంద్



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాయదుర్గం పట్టణంలోని గురువారం 1వ వార్డులో సీఐ దేవానంద్ ప్రజలతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తి తన ఓటును తాను నచ్చిన వ్యక్తికి తమ ఓటు హక్కును వినియోగించుకోండి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు చోరు చేసుకుంటే 100 కు లేక సీఐ నెంబర్ 9440901869కు,లేదా ఎస్సై 9440110925 కు ఫిర్యాదు చేయండి. ఏదైనా సమస్య ఉంటే ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని, సమస్యను పరిష్కరించేందుకు పోలీసులు కృషి చేస్తారని తెలిపారు. అదేవిధంగా పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఐ దేవానంద్ సూచించారు. చిన్న వయసులోనే పిల్లలు చెడు అలవాట్లకు, మద్యం మరియు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు క్రమశిక్షణతో పెంచాలన్నారు. పిల్లలను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి చదువుకు దగ్గర చేయాలని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. టీవీ, సినిమాలు, ఇతర చెడు ప్రభావాలకు పిల్లలు లోనుకాకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు. చిన్న వయసులోనే ప్రేమ వ్యవహారాలు, బాల్య వివాహాలు వంటి విషయాల్లో పిల్లలు తప్పుదారి పట్టకుండా తల్లిదండ్రులు వారికి మంచి మాటలు చెప్పి సరైన మార్గంలో నడిపించాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదని స్పష్టం చేశారు. కుటుంబం బాగుంటే ఊరు బాగుంటుందని, పిల్లలను చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో పెంచి మంచి భవిష్యత్తును అందించాలని సీఐ దేవానంద్ కోరారు. ఇదే సందర్భంగా రాయదుర్గంలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభించామని, కుటుంబ సమస్యలు, భార్యాభర్తల మధ్య వివాదాలు తదితర సమస్యలపై కౌన్సెలింగ్ ద్వారా పరిష్కారం చూపేందుకు ఈ కేంద్రం ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య ఎన్నికలకు సహకరించాలని సీఐ దేవానంద్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువ కులు దుర్మరణం

- మృతుల కుటుం బాలను పరామర్శించిన యువ నాయకుడు సీబీ మంజునాథెడ్డి



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణ సమీపంలోని చెరువు కట్ట వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన భా ర్గవ్,పురుషోత్తమ ద్విచక్ర వాహనం పై వెళుండగా ప్రమాదం చోటుచేసు కుంది.ఈ ఘటనతో వారి స్వగ్రామం లో విషాదఛాయలు అలుముకు న్నాయి.ఈ ప్రమాద విషయం తెలు సుకున్న గుంతకల్లు నియోజకవర్గ యువ నాయకుడు సీబీ మంజునా థ్రెడ్డి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి చేరు కుని మార్చురీలో ఉన్న యువకుల మృతదేహాలకు నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి ధైర్యం చెప్పారు.అదేవిధంగా గుత్తి పట్టణంలోని బండగేరికి చెందిన మ రో యువకుడు మృతి చెందడంతో అతని మృతదేహానికి కూడా నివా ళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణస్వామి, మాజీ కౌన్సిలర్లు వాల్మీకి శివరాం,వ రదరాజులు, వైసీపీ నాయకులు బిం గి కిరణ్బాబు, హనుమేష్, జగదీష్, అరుణ కుమార్, వాల్మీకి పవనకుమార్‌లతో పాటు గొల్లలదొడ్డి గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పప్పుశనగ విత్తనాల పంపిణీ ప్రారంభం..

- 35 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు..

### 2,870 క్వింటాళ్లు కేటాయింపు..

**బెళుగుప్ప- సూర్య వాస్తవం:** రబీ సీజన్‌కు సంబంధించి పప్పుశనగ విత్తనాల రిజిస్ట్రేషన్, పంపిణీ ప్రక్రియను మండలంలో ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్ తెలిపారు. రైతులకు 35 శాతం సబ్సిడీపై విత్తనాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పప్పుశనగ విత్తనాల క్వింటాలు పూర్తి ధర రూ.9,000 కాగా, 35 శాతం సబ్సిడీ కింద రూ.3,150 తగ్గించి రైతు వాటాగా రూ.5,850 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. బెళుగుప్ప మండలానికి మొత్తం 2,870 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలను ప్రభుత్వం కేటాయించినట్లు వివరించారు. ఇప్పటివరకు మండలంలోని వివిధ రైతు సేవా కేంద్రాల్లో 838 మంది రైతులు 1,230 క్వింటాళ్ల విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. గురువారం బెళుగుప్ప మండల కేంద్రంలో నాయకులు, అధికారుల సమక్షంలో పప్పుశనగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, సింగిల్ విండో డైరెక్టర్ కంచి రాముడు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో జన్మించే శిశువులకు అందించునున్న ఎన్టీఆర్ బేబీ కిట్లును పరిశీలించిన "ఆరోగ్యశాఖ మంత్రి



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** అమరావతిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే శిశువులకు అందించనున్న ఎన్టీఆర్ బేబీ కిట్ల నమూనాలను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ గురువారం పరిశీలించారు. కిట్లలోని వస్తువుల నాణ్యత,శిశువులకు వాటి ఉపయోగాన్ని పరిశీలించిన మంత్రి,త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా బేబీ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏటా సుమారు 2.45 లక్షల మంది శిశువులకు ఈ కిట్లు అందించనుండగా,ఇందుకోసం ఏటా రూ.51.15 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు మంత్రి వివరించారు.ఒక్కో కిట్ ధర రూ.1,400.22గా ఉందని తెలిపారు.శిశువుల తొలి దశలో వెచ్చదనం, పరిశుభ్రత,భద్రతతో పాటు ఇంటికి వెల్లిన తర్వాత అవసరమైన ప్రాథమిక సంరక్షణకు ఉపయోగపడేలా కిట్లను రూపొందించినట్లు పేర్కొన్నారు.ఒక్కో కిట్‌లో దోమల నివారణ వలతో కూడిన బేబీ బెడ్,బేబీ మాకింటోష్,శిశువుల దుస్తులు,బేబీ టవల్,3 బేబీ న్యాపీలు,బేబీ పౌడర్,షాంపూ,బేబీ ఆయిల్,సబ్బు, సబ్బు పెట్టె,రాటిల్ టాయ్,కిట్ బ్యాగ్ వంటి అవసరమైన వస్తువులు ఉంటాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## వన్యప్రాణుల సంరక్షణ పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు..

### - గెలుపొందిన వారికి బహుమతులు



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** నేలపట్టు పక్షుల కేంద్రం సిబ్బంది వన్యప్రాణులు - వారోత్సవాలు సందర్భంగా విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ,మరియు వాటి చట్టాలపై ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం దొరవారిసత్రం మండల కేంద్రంలోని కేజీబీవీ,ఏకొల్లు జడ్పీ హైస్కూల్ లో వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు.ఈ పోటీలలో వన్యప్రాణులు సంరక్షణ అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించి,ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు.కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థిని పూర్ణ రంజిత ప్రథమ బహుమతి సాధించింది,లక్ష్మీ జ్వాల ఇంటర్ విద్యార్థిని రెండవ బహుమతి,కుమారి థర్డ్ ప్రైజ్ సాధించింది. అదేవిధంగా ఏకొల్లు జడ్పీ హైస్కూల్ తొమ్మిదవ తరగతి విద్యార్థిని నిషిత,మొదటి బహుమతి, సాయి కీర్తన రెండవ బహుమతి,మధులత మూడవ స్థానం సాధించిన వారికి వైల్డ్ లైఫ్ సిబ్బంది బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది ఎఫ్ఎస్ఓ బాలయ్య, గైడ్ హుస్సేనయ్య పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## స్థానిక ఎన్నికలపై అవగాహన కలిగిస్తున్న.."ఎస్ఐ శివశంకర్"

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** రాబోయే పురపాలక స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా బి.డి.కాలనీ,25వ వార్డు పరిధిలోని గురువారం ప్రజలకు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయుడుపేట పట్టణ ఎస్సై శివశంకర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమ విలువైన ఓటు హక్కును శాంతియుత వాతావరణంలో, బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రశాంత వాతావరణం లో ఎన్నికలు ముగిసేలా ప్రజలు పోలీసు వ్యవస్థకు సహకరించాలని కోరారు. అనంతరం సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అపరిచిత వ్యక్తులతో బ్యాంక్ వివరాలు, ఓటీపీలు పంచుకోవద్దని సూచించారు.గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు,సమాజంపై దాని ప్రభావాన్ని వివరించారు.ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని,మహిళలపై జరుగుతున్న అన్యాయాలు,వారి రక్షణకు అందుబాటులో ఉన్న చట్టాలు మరియు అత్యవసర సమయాల్లో డయల్ 112 సేవలను ఎలా ఉపయోగించుకోవాలో స్పష్టంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట పోలీసులు,వార్డు ప్రజలు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# "టీబీ ముక్త్ భారత్ అభియాన్"

# కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్






**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** అమరావతిలోని ఏపీఐఐసీ నుంచి"టీబీ ముక్త్ భారత్ అభియాన్"లో భాగంగా నిర్వహించిన జోష్ బృందాల జాతీయ స్థాయి కార్యక్రమంలో గురువారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ వర్చువల్‌గా పాల్గొన్నారు.కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జె.పీ.నడ్డా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీబీ నిర్మూలనను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.టీబీ నిర్మూలన కార్యక్రమాన్ని గ్రామాలు,పట్టణాల్లో మరింత విస్తృతంగా అమలు చేసేందుకు జోష్ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు.క్లాస్--1 స్థాయి అధికారులు ఈ బృందాలకు నాయకత్వం వహించగా,మై భారత్ వాలంటీర్లు,ఎన్‌సీసీ క్యాడెట్లు సభ్యులుగా భాగస్వాములవుతారు.ప్రజల్లో టీబీపై అవగాహన కల్పించడం,వ్యాధి లక్షణాలపై చైతన్యం తీసుకు రావడం, పరీక్షలు చేయించుకునేలా ప్రోత్స హించడం, చికిత్స పొందుతున్న వారికి సహకారం అందించడం వంటి కార్యక్రమాలను ఈ బృందాలు చేపట్ట నున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ జిల్లాలు,మండలాల స్థాయిలో జోష్ బృందాలను చురుగ్గా పనిచేయించి,ప్రజల భాగస్వామ్యంతో టీబీ నిర్మూలన కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.టీబీపై ఉన్న అపోహలను తొలగించడం,వ్యాధిని తొలిదశలోనే గుర్తించేలా ప్రజలను ప్రోత్సహించడం,ప్రభుత్వ శాఖలతో పాటు యువత,స్వచ్ఛంద కార్యకర్తలను భాగస్వాములుగా చేయడం ద్వారా టీబీ రహిత భారత్ లక్ష్య సాధనకు కృషి చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో

## రైతుల సంక్షేమానికే ప్రాధాన్యం"ఎమ్మెల్యే నెలవల.విజయశ్రీ"



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** రైతుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ ఎన్. విజయశ్రీ అన్నారు. గురువారం రెవిన్యూ అధికారులు సింగనాలత్తూరు గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆ గ్రామ పంచాయితీ పరిధిలో నిర్వహించిన రీ-సర్వే భూములకు ప్రభుత్వం భూ హక్కు కల్పిస్తూ రాజముద్ర తో కూడిన 623 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సొంత భూమి ఉన్న రైతులు వాటికి హక్కు పత్రాలు లేని కారణంగా కూటమి ప్రభుత్వం సమగ్ర భూ సర్వే నిర్వహించి, అన్ని హక్కులు కలిగిన రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసి ఆదుకుందని గుర్తు చేశారు.

భూ సమస్యలు శాశ్వత పరిష్కారానికి రీ సర్వే ద్వారా ఎప్పటికీ రైతు సమస్య ఎదుర్కొనకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.2027 నాటికి రాష్ట్రవ్యాప్తంగా రి సర్వే పూర్తి చేసి పట్టాలు అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తూ,వారి సంక్షేమానికి ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాజేంద్ర, ఎంపీడీవో గోవర్ధన్,పార్టీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు,నెలబల్లి సొసైటీ ప్రెసిడెంట్ శ్రీహరి రెడ్డి,పార్టీ కార్యదర్శి మనోహర్ రెడ్డి,పలు శాఖల అధికారులు,పార్టీ నాయకులు,రైతులు హాజరయ్యారు.

## చిన్న వివాదాలకు కోర్టుల చుట్టూ తిరగొద్దు

**- జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి-**
**నాయుడుపేట లో లీగల్ లిట్రసి క్యాంప్**
**- న్యాయ హక్కులు, సేవలపై ప్రజలకు అవగాహన కల్పించిన న్యాయమూర్తి- చిన్న సమస్యలు పెద్ద వివాదాలుగా మారకుండా పరిష్కరించుకోవాలి**



**నాయుడుపేట- సూర్య వాస్తవం :**చిన్నచిన్న సమస్యలు, వివాదాల పరిష్కారం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి సూచించారు. నాయుడుపేట పట్టణంలోని బీడీ కాలనీలో గురువారం న్యాయ సేవలపై అవగాహన కల్పించేందుకు న్యాయ అవగాహన శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. చిన్న వివాదాలను కోర్టుల్లోనే పరిష్కరించుకోవాలనే ఆలోచనకు బదులుగా, కోర్టులోని మధ్యవర్తిత్వ కేంద్రాన్ని సంప్రదించడం ద్వారా సమస్యలకు సులభమైన పరిష్కారం పొందవచ్చన్నారు. మధ్యవర్తిత్వ విధానం ద్వారా ఇరుపక్షాల సమ్మతితో వివాదాలను పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకోసం అదనపు ఖర్చులు లేకుండా న్యాయ సహాయం పొందవచ్చని వివరించారు.ప్రజలు తమ సమస్యలపై అవగాహన పెంచుకోవడంతో పాటు, అందుబాటులో ఉన్న న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల చెంగయ్య, సీనియర్ న్యాయవాది సోమశేఖర్, ఉపాధ్యక్షుడు టీవీ రమణ, న్యాయవాదులు దార రవి, బాలు, సుమన్, వంశీ, పరశు రామ్, నాయుడుపేట పట్టణ ఎస్ఐ ఎం. శివశంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ అప్రమత్తం.. అల్లర్లకు దూరం

**- శాంతియుత ఎన్నికలకు ప్రజల సహకారం అవసరం: ఎస్ఐ శివశంకర్‌రావు**
**- మత్తు పదార్థాలపై , సైబర్ నేరాలపై, ట్రాఫిక్ నిబంధనలు జాగ్రత్త పాటించాలి**

**నాయుడుపేట- సూర్య వాస్తవం :**తిరుపతి జిల్లా నాయుడుపేట మండలంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని నాయుడుపేట పట్టణ ఎస్ఐ ఎం.శివశంకర్‌రావు కోరారు. గురువారం సాయంత్రం పట్టణంలోని బీడీ కాలనీని సందర్శించిన ఆయన స్థానికులతో మాట్లాడి శాంతిభద్రతల పరిరక్షణపై పలు సూచనలు చేశారు.ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, అల్లర్లకు పాల్పడకుండా సంయమనం పాటించాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా విద్యార్థులు వివాదాల్లోకి వెళ్లి అల్లర్లకు పాల్పడితే వారి భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగానికి దూరంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. మత్తు పదార్థాల విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయించే, వినియోగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ వంటి వివరాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు.వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించి, ఏదైనా సమస్య లేదా అనుమానాస్పద కార్యకలాపం కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ శివశంకర్‌రావు కోరారు.



## సూర్య 'సీన్' నుంచి ఫస్ట్ సింగిల్..

# "అమ్మో ఇది ఎవర్రా"!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య కథానాయకుడిగా, విలక్షణ దర్శకుడు జిత్తు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సీన్'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చారు. గురువారం ఈ చిత్రం నుంచి "అమ్మో ఇది ఎవర్రా" అనే మొదటి పాటను విడుదల చేశారు. తమిళంలో "అతి ఇవ యార్రా" పేరుతో విడుదలైన ఈ పాట సినీ ప్రియులను, అభిమానులను ఆకట్టుకుంటోంది.నిర్మాణ సంస్థ ఝుగరం స్టూడియోస్ తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఈ పాటను పంచుకుంది. సుషిన్ శ్యామ్ స్వరపరిచిన ఈ గీతానికి తమిళంలో రాజప్రియన్ సాహిత్యం అందించి, స్వయంగా ఆలపించాడు. తెలుగులో రాకేందు మౌళి సాహిత్యం అందించగా, వినాయక్ ఆలపించాడు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన టైటిల్ టీజర్ ప్రేక్షకులలో అంచనాలను భారీగా పెంచింది.





"అతని నీచమైన స్వభావాన్ని దాచిపెట్టడానికి, అతని ప్రతిభను ప్రదర్శిస్తూనే ఉంటారు" అనే వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన టీజర్, ఇన్‌బరాజ్ అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా సూర్య పాత్రను పరిచయం చేసింది. "నేను జైల్లో పెట్టిన 900 మంది నేరగాళ్లలో నువ్వొకడివి" అంటూ సూర్య చెప్పే డైలాగ్ ఆయన పాత్ర ఎంత తీవ్రంగా ఉండబోతోందో తెలియజేసింది.గత ఏడాది డిసెంబర్‌లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది.

మొదట 'సూర్య 47' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను ప్రస్తావించారు. సూర్య, జిత్తు మాధవన్ కాంబినేషన్‌లో సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచి దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఈ చిత్రంలో సూర్య సరసన నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యువ నటుడు నాస్లెన్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. జాన్ విజయ్, ఆనందరాజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. వినీత్ ఆగస్టియన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అజ్మల్ సాబు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# 22 ఏళ్లకే పెళ్లి..

## 'సూపర్' బ్యూటీ ఆయేషా టకియా ఇప్పుడు ఎక్కడుంది? ఏం చేస్తోంది?



తెలుగులో నాగార్జున సరసన 'సూపర్', బాలీవుడ్ లో సల్మాన్ ఖాన్ సరసన 'వాంటెడ్' సినిమాలో నటించి ఎంతో గుర్తింపు తెచ్చుకున్న ఆ క్యూట్ హీరోయిన్ ఆయేషా టకియా గుర్తుందా?బ్లాక్‌బస్టర్ సినిమాల తర్వాత ఆమె కెరీర్ మరో స్థాయికి వెళుతుందని అందరూ భావించారు. కానీ, ఉన్నట్టుండి ఆమె వెండితెరకు దూరమైంది. కెరీర్ అత్యున్నత స్థాయిలో ఉన్నప్పుడు స్టార్‌డమ్‌ను వదిలి, కుటుంబ జీవితాన్ని ఎంచుకున్న ఆయేషా టకియా ప్రస్తుత జీవితంపై ఓ ప్రత్యేక కథనం.

చాలా చిన్న వయసులోనే మోడలింగ్‌తో కెరీర్ ప్రారంభించిన ఆయేషా, షాహిద్ కపూర్‌తో కలిసి నటించిన 'ఐ యామ్ ఎ కంప్లాన్ గర్ల్' యాడ్‌తో దేశవ్యాప్తంగా పాపులర్ అయింది. ఫల్గుణి పాఠక్ పాడిన "మేరీ చునార్ ఉడ్ ఉడ్ జాయే" మ్యూజిక్ వీడియోతో ఆమె యువతలో ఎంతో క్రేజ్ సంపాదించుకుంది. 2004లో 'టార్జాన్: ది వండర్ కార్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి, తొలి సినిమాకే ఫిలింఫేర్ ఉత్తమ నూతన నటి అవార్డును గెలుచుకుంది. ఆ తర్వాత వచ్చిన 'సోచా నా థా', నటనకు ప్రాధాన్యమున్న 'డోర్' వంటి చిత్రాలతో నటిగా మంచి పేరు తెచ్చుకుంది. ఇక 2009లో ప్రభుదేవా దర్శకత్వంలో వచ్చిన 'వాంటెడ్' ఆమె కెరీర్‌లోనే అతిపెద్ద కమర్షియల్ హిట్‌గా నిలిచింది.కెరీర్ ఇలాంటి పీక్స్‌లో ఉన్నప్పుడే ఆయేషా తన జీవితంలో కీలక నిర్ణయం తీసుకుంది. 2009 మార్చి 1న, తన 22వ ఏట, ప్రముఖ రెస్టారెంట్ వ్యాపారి ఫర్హాన్ అజ్మీని వివాహం చేసుకుంది. పెళ్లి తర్వాత నటనకు పూర్తిగా గుడ్‌బై చెప్పి, తన కుటుంబ జీవితానికే పూర్తి సమయం కేటాయించాలని నిర్ణయించుకుంది. వారికి 2013లో కుమారుడు మైకేల్ జన్మించాడు. భర్త వ్యాపారంలో సహాయం చేస్తూ, జంతు సంరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఆమె తన జీవితాన్ని గడుపుతోంది.అయితే, కొన్నేళ్ల తర్వాత ఆమె మరోసారి వార్తల్లో నిలిచింది, కానీ ఈసారి అందుకు కారణం సినిమాలు కాదు. 2017లో ఆమె ముఖంలో స్పష్టమైన మార్పులు కనిపించే కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆమె పెదాలు, ముఖం లావుగా కనిపించడంతో, ప్లాస్టిక్ సర్జరీ లేదా బొటాక్స్ చేయించుకున్నారంటూ తీవ్రమైన ట్రోలింగ్ జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని ఆయేషా ఖండించింది. కొన్ని ఫోటోలను మార్ఫింగ్ చేశారని, ఈ ట్రోలింగ్‌ను తాను నవ్వుతూ ఎదుర్కొన్నానని ఆమె స్పష్టం చేసింది.అప్పటి నుంచి ఆయేషా దాదాపుగా బాలీవుడ్ వెలుగులకు, సోషల్ మీడియాకు దూరంగానే ఉంటోంది. తన ఇన్‌స్టాగ్రామ్‌లోని పోస్టులన్నింటినీ తొలగించి కేవలం ఒకే ఒక్క పోస్ట్‌ను ఉంచిందంటే ఆమె ఎంత ప్రైవసీ కోరుకుంటోందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం తన కుమారుడు, కుటుంబంతో కలిసి ముంబైలో ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతోంది. ఒకప్పుడు స్టార్‌డమ్‌ను చూసి, ఆ తర్వాత వ్యక్తిగత జీవితానికే ప్రాధాన్యతనిస్తూ ఇండస్ట్రీకి దూరమైన నటీమణులలో ఆయేషా టకియా ఒకరిగా నిలిచిపోతుంది.



## సంజూకి మరో ఛాన్స్ ఇస్తారా? మయాంక్ సంగతేంటి?..

# నేడు వెస్టిండీస్‌తో భారత్ రెండో టీ20



తొలి టీ20లో వెస్టిండీస్ పై అదరగొట్టిన భారత్.. అదే జోరులో సిరీస్‌లో 2-0తో ముందంజ వేయాలని చూస్తోంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో భారీ ఓటమి ఎదురైన వెస్టిండీస్ ఎలాగైనా పుంజుకుని సిరీస్‌ను సమం చేయాలని పట్టుదలగా ఉంది. అయితే రాంచీలో నేడు జరిగే రెండో టీ20కి ముందు ఫలితం కంటే ఎక్కువగా ఆసక్తి రేపుతున్నది భారత జట్టు ఎంపికే. సంజూ శాంసన్ కొనసాగుతాడా? వైభవ్ సూర్యవంశీకి అవకాశం వస్తుందా? తొలి మ్యాచ్‌లో భారీగా పరుగులు ఇచ్చిన మయాంక్ యాదవ్‌కు మరో ఛాన్స్ ఇస్తారా? ఈ ప్రశ్నలకు రేపు సమాధానం దొరకనుంది.లక్నోలో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వెస్టిండీస్ 171 పరుగులు చేయగా.. భారత్ కేవలం 14.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 43 బంతుల్లోనే అజేయంగా 102 పరుగులు చేసి మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు. ఇషాన్ కిషన్‌తో కలిసి 137 పరుగుల అజేయ భాగస్వామ్యంతో భారత్‌కు సునాయాస విజయాన్ని అందించాడు.

### సంజూ స్థానంపై ఉత్కంఠ

తొలి మ్యాచ్‌లో సంజూ శాంసన్ 11 పరుగులకే వెనుదిరిగాడు. అంతకుముందు అతడి చివరి నాలుగు టీ20 ఇన్నింగ్స్‌లు 9, 7, 2, 11 పరుగులుగా ఉన్నాయి. దీంతో ఓపెనింగ్ స్థానంపై చర్చ మొదలైంది. జట్టులో వైభవ్ సూర్యవంశీ రూపంలో దూకుడైన మరో ఓపెనర్ ఉన్నాడు. పవర్‌ప్లేలోనే బౌలర్లపై విరుచుకుపడే సామర్థ్యం వైభవ్‌కు ఉంది. అందుకే అతడిని తుది జట్టులోకి తీసుకుంటే భారత్ ఓపెనింగ్ కూర్పులో మార్పు చేసే అవకాశం ఉంటుంది. అయితే ఒక్క మ్యాచ్‌లో విఫలమైనందుకు సంజూను పక్కన పెడతారా? లేక అనుభవం ఉన్న వికెట్‌కీపర్ బ్యాటర్‌కు మరో అవకాశం ఇస్తారా? అన్నదే అసలు ఉత్కంఠ.

### మయాంక్‌కు మరో అవకాశం?

బౌలింగ్‌లోనూ భారత్‌కు ఒక ప్రశ్న ఎదురవుతోంది. తొలి టీ20లో మయాంక్ యాదవ్ తన మొదటి ఓవర్లోనే 16 పరుగులు ఇచ్చాడు. మొత్తంగా కూడా అతడి బౌలింగ్‌లో పరుగుల వరద పారింది. అయితే రూథర్‌ఫోర్డ్‌ను ఔట్ చేసి ఒక వికెట్ సాధించాడు.మరోవైపు అరంగేట్ర మ్యాచ్‌లో నమన్ ధీర్ 3 వికెట్లతో అదరగొట్టాడు. కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ చెరో రెండు వికెట్లు తీశారు. దీంతో స్పిన్ విభాగంపై భారత్‌కు పెద్దగా ఆందోళన కనిపించడం లేదు. పేస్ కూర్పులోనే మార్పు చేసే అవకాశం ఉంది.అయితే మయాంక్‌ను వెంటనే తప్పించకుండా మరో అవకాశం ఇవ్వాలన్న అభిప్రాయం కూడా ఉంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రయోగాలకు అవకాశం ఉన్నప్పటికీ.. సిరీస్ ఆధిక్యాన్ని 2-0కి పెంచుకోవడం కూడా భారత్‌కు ముఖ్యమే.

### శ్రేయస్ ఫామ్.. భారత్‌కు పెద్ద బలం

తొలి మ్యాచ్‌కు ముందు శ్రేయస్ అయ్యర్ ఫామ్‌పై ప్రశ్నలు తలెత్తాయి. కానీ కెప్టెన్ తన బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చాడు. 43 బంతుల్లో 102 పరుగులతో టీ20ల్లో తొలి శతకాన్ని నమోదు చేశాడు. దీంతో భారత మిడిలార్డర్‌కు భారీ బలం వచ్చింది.తొలి మ్యాచ్‌లో 35 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్‌ను అయ్యర్, ఇషాన్ కిషన్ కలిసి గట్టెక్కించారు. ఇప్పుడు వెస్టిండీస్ బౌలర్లు అయ్యర్‌ను ఎలా అడ్డుకుంటారన్నది కూడా మ్యాచ్‌లో కీలక అంశంగా మారనుంది.

### వెస్టిండీస్ ఏం చేస్తుంది?

తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్ పవర్‌ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయింది. తర్వాత షాయ్ హోప్ 52, రూథర్‌ఫోర్డ్ 56 పరుగులతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. కానీ చివరికి 171 పరుగులకే ఆలౌటైంది. భారత్ బ్యాటింగ్ బలం ముందు ఈ స్కోరు సరిపోలేదు.రాంచీలో పరిస్థితులను ఉపయోగించుకుని భారత్‌పై ఒత్తిడి పెంచాలని కరీబియన్ జట్టు చూస్తోంది. ముఖ్యంగా భారత ఓపెనర్లను తొందరగా ఔట్ చేయడం, అయ్యర్‌కు పరుగులు చేయకుండా కట్టడి చేయడం వెస్టిండీస్ వ్యూహంలో కీలకం కానుంది.

### రాంచీలో ఛేజింగ్‌కు పైచేయి

రాంచీ జేఎస్‌సీఏ స్టేడియంలో ఇప్పటివరకు ఏడు టీ20 మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో నాలుగు మ్యాచ్‌ల్లో రెండోసారి బ్యాటింగ్ చేసిన జట్టే గెలిచింది. మూడు మ్యాచ్‌ల్లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు విజయం సాధించింది. ఇక్కడ తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 138 పరుగులుగా ఉంది.అయితే భారీ స్కోర్లకు కూడా ఈ మైదానం వేదికైంది. శ్రీలంకపై భారత్ 196/6 చేయడం ఇక్కడ అత్యధిక టీ20 స్కోరు. న్యూజిలాండ్‌పై భారత్ 155 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించడం ఇక్కడ అత్యధిక విజయవంతమైన ఛేజ్.



# ఇప్పటికీ ఫిట్..

## బరువు తగ్గకుండానే బలం పెంచిన భువనేశ్వర్ కుమార్!

టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్ 2026 సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో అందరినీ ఆశ్చర్యపరిచడం తెలిసిందే. 36 ఏళ్ల వయసులోనూ స్థిరంగా 140 కిలోమీటర్ల వేగంతో బంతులు విసరడమే కాకుండా, ఏకంగా 28 వికెట్లు పడగొట్టి ఓ భారత బౌలర్‌గా అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. వయసు పైబడటంతో కెరీర్ ముగిసిపోయిందనుకున్న దశలో.. నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు టీమిండియాలోకి పునరాగమనం చేశాడు. ఈ రేంజ్ పునరాగమనం వెనుక అతడి కఠోర శ్రమ, అసాధారణ శారీరక పరివర్తన ఉంది. ఈ మార్పు వెనుక ఉన్న రహస్యాలను అతడి పర్సనల్ ట్రైనర్ సూర్య యాదవ్ ఓ జాతీయ మీడియాకు వెల్లడించాడు.గత మూడేళ్లలో భువనేశ్వర్ తన శరీరాన్ని పూర్తిగా మార్చుకున్నాడు. ఆసక్తికరమైన విషయమేమిటంటే, అతడి బరువులో పెద్దగా మార్పు రాలేదు. అప్పుడు, ఇప్పుడు కూడా భువీ బరువు సుమారు 73-74 కిలోలే. కానీ, అసలు మార్పంతా శరీరంలోని కొవ్వు, కండరాల నిష్పత్తిలోనే ఉంది. మూడేళ్ల క్రితం భువీ శరీరంలో కొవ్వు శాతం (బాడీ ఫ్యాట్) దాదాపు 20 శాతం ఉండగా, కఠోర శ్రమతో దాన్ని 13-14 శాతానికి తగ్గించుకున్నాడు. అంటే, కొవ్వును కరిగించి, ఆ స్థానంలో కండరాల బలాన్ని పెంచుకున్నాడు. ఇది ఫాస్ట్ బౌలర్‌కు అత్యంత కీలకం.గతంలో వెన్ను, చీలమండ, మోకాలి గాయాలతో ఇబ్బందిపడిన భువనేశ్వర్‌కు బరువులు ఎత్తే శిక్షణ అంటే కాస్త భయం ఉండేది. అయితే, ట్రైనర్ సూర్య యాదవ్ అతడిని నెమ్మదిగా ప్రోగ్రెసివ్ రెసిస్టెన్స్ ట్రైనింగ్‌కు అలవాటు చేశాడు. ఫలితంగా, ఒకప్పుడు స్క్వాట్స్‌లో కేవలం 40 కిలోల బరువును కష్టంగా ఎత్తిన భువీ, ఇప్పుడు ఏకంగా 110-120 కిలోల బరువును సునాయాసంగా ఎత్తే స్థాయికి చేరుకున్నాడు. ఇది అతడి కాళ్లలో పెరిగిన బలానికి నిదర్శనం.

# కడప.అమీన్ పీర్ దర్గా
# ఉరుసు మహోత్సవాలను విశ్వ వ్యాప్తం చేయాలి

**- డీఆర్వో మల్లికార్జునుడు అధ్యక్షతన ఉరుసు మహోత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం**
**- ఈనెల 25, 26 తేదీల్లో కన్నుల పండుగగా గంధం, ఉరుసు మహోత్సవాలు**



**కడప - సూర్య వాస్తవం :** కడప ఖ్యాతిని విశ్వ వ్యాపితం చేసేలా.. అమీన్ పీర్ దర్గా మహోత్సవాలను భక్తి భావం, పర్యాటక వైభవాన్ని ప్రతిబింభించేలా.. అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో చేపట్టాలని.. డిఆర్వో కె.మల్లికార్జునుడు.. దర్గా ఉత్సవ కమిటీ సభ్యులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్ లో.. అమీన్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై.. డిఆర్వో కె. మల్లికార్జునుడు అధ్యక్షతన ఊరుసు ఉత్సవ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిలుగా డిఆర్వో తోపాటు... ఏఎస్పీ ప్రకాశ్ బాబు, కడప ఆర్డీవో మురళి, నగర కమీషనర్ భవానీ ప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి హిదాయతుల్లా హాజరయ్యారు. ఈ సందర్బంగా డిఆర్వో మాట్లాడుతూ.. సాధ్యాత్మికం, పర్యాటక వనరులు కలబోసిన వైఎస్ఆర్ కడప జిల్లా ఖ్యాతిని దేశ విదేశాల్లో ప్రతిబింభించేలా గతంలో కంటే ఈ ఏడాది ఉరుసు ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. రెవెన్యూ, సంబందిత శాఖల సమన్వయంతో అన్ని రకాల ఏర్పాట్లను పూర్తిచేసి.. ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అలాగే పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని, ఎక్కడా ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా గట్టి భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసు కోవాలన్నారు. ఉరుసు మహోత్సవాల్లో భాగంగా.. ఇప్పటికే ఈ నెల 12వ తేదీ "జేలా" కార్యక్రమంతో.. ఊరుసు ఉత్సవాలకు నాంది పలకడం జరుగు తుందన్నారు. ఉరుసు మహోత్సవాల సందర్బంగా.. ముఖ్యమైన 5 రోజుల పాటు రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, దర్గా.. వరకు నగరంలోని అన్ని రూట్లను కవర్ చేస్తూ.. నిరంతరాయంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఉత్సవాల్లో భాగంగా దర్గా, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ దీపాలంకరణలో ఎక్కడా కూడా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా నిరంతర పర్యవేక్షణ జరగాలన్నారు. వీఐపీలు, ప్రోటోకాల్ నిబంధనలు తప్పక పాటిం చాలన్నారు. కడప నగరంలో జరిగే అతిపెద్ద మహోత్సవాన్ని ప్రపంచం వీక్షించేలా.. సమాచార పౌర సంబంధాల శాఖ, మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పరిశుభ్రత ఏర్పాట్లను చూడాలన్నారు. పారిశుధ్యం, రోడ్లు, విద్యుత్, మంచినీరు వసతులకు ఎలాంటి కొరత లేకుండా.. ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అధిక సంఖ్యలో వైద్య సిబ్బందిని వైద్యాధికారులను నియమించి ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే 108, అంబులెన్స్ తదితర వాహనాలతో పాటు అత్యవసర మందులు కూడా అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం శాఖల వారీగా చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఏఎస్పీ ప్రకాష్ బాబు మాట్లాడుతూ.. ఊరుసు మహోత్సవాల్లో ఈ నెల 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు కన్నుల పండుగగా జరుగనుందని.. ప్రధానంగా 25, 25వ తేదీల్లో జరిగే గంధం, ఉరుసు ఉత్సవ ఘట్టాలకు లక్షలాది మంది భక్తులు, విఐపిలు హాజరవుతారన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఉరుసు మహోత్సవాన్ని జరిపించడంలో పోలీసు శాఖ అన్ని రకాల భద్రత చర్యలను చేపట్టిందన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా.. రూట్ మ్యాపింగ్ చేసి సిబ్బందికి డ్యూటీలు కేటాయిస్తున్నామన్నారు.

**ఉరుసు మహోత్సవాల్లో ప్రధాన కార్యక్రమాలు**

- 24-10-2026వ తేది మొదటి రోజు ఉదయం 10 గంటలకు సర్ గిరోలు, షఖీర్లు, ఊరేగింపుతో దర్గా షరీఫ్ షరీఫ్ నకు వచ్చి చదివింపులు ఇచ్చి వారి స్తానంలో బిస్తర్ చేయుదురు.
- 25-10-2026వ తేదీ రెండవ రోజు గంధం కార్యక్రమంలో భాగంగా ఉదయం.. దర్గా నుండి బాదుల్లా సాహెబ్ మకాన్ వరకుపకీర్ల ఊరేగింపు సాంగ్యం, సాయంత్రం పీఠాధిపతులు దివ్యాసనం, ధ్యాన తపస్సు. రాత్రి గంధం ఊరేగింపు, ఫేతెహ సమర్పణ, ఖవాలీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.
- 26-10-2026 వ తేదీ మూడవ రోజు.. ఇదార-యే-అమీనియా చిస్తీయా వార్షిక నివేదిక. రాత్రి ఉరుసు మహోత్సవం, ఎద్దుకబండ్ల చౌహరీ ఖలీఫల చాందినీ, గంధం ఊరేగింపు, చదివింపులు, ఖవాలీ మొదలైన పవిత్ర పుణ్య కార్యక్రమాలు జరుగుతాయి.
- 27-10-2026 వ తేదీ నాల్గవ రోజు.. తహలీల్ ఫతేహ ఉత్సవంలో భాగంగా.. ప్రసాద సమర్పణ, సంబందిత హోలీ ప్రార్ధనలు, రాత్రి ప్రముఖ విద్వాంసులతో 82వ ఉర్దూ కవి సమ్మేళనం (ముషాయిరా) జరుగుతుంది.
- 28-10-2026 వ తేదీ ఐదవ రోజు.. రాత్రి 10గంటల నుండి తెల్లవారి 3 గంటల వరకు సమాఖానీ సజ్జదనషీన్ పీఠాధిపతి వారి ఆధ్వర్యంలో ఖవాలీ, ఖురాన్ పఠనం, తదితర కార్యక్రమాలు.
- 29-10-2026 వ తేదీ ఆరవ రోజు.. ఫకీర్లతో పీఠాధిపతులు వారి వాటర్ గండిలోని హాజరత్ మస్తాన్ స్వామివారి దర్శనం, జెండా ప్రతిష్ట, చదివింపులు.

కార్యక్రమంలో... అమీన్ పీర్ దర్గా మేనేజర్ మహ్మద్ అలీఖాన్, డిఎంహెచ్ఓ, ఫైర్, ఆర్టీసీ మైనారిటీ, ఈడపీఆర్, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు, సంబందిత శాఖల జిల్లా అధికారులు, దర్గా మత పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా 9వ అంతర్జాతీయ పోషణ మాసోత్సవం



**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం :**మన అంగన్వాడీ -- మన బాధ్యత అనే నినాదంతో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని గురువారం లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి నందు సిడిపిఓ జహ్రాబి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిడిపిఓ జహ్రాబీ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు పోషకాహారం, పోషక పదార్థాల ప్రాధాన్యత, తల్లి--శిశు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.చిన్నారులకు సమతుల్యమైన పోషకాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడాలని సూచించారు. గర్భధారణ సమయంలో తల్లులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రోహిణి, సూపర్వైజర్లు అంగన్వాడీ టీచర్లు ఆయాలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## భార్యపై అనుమానంతో భర్త రోకలి బడితో దాడి

**- తలకు పూర్తి గాయం చికిత్స పొందుతూ మృతి**



**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం :**మండలంలోని బి ఎర్రగుడి పంచాయతీలోని కాపు పల్లెకు చెందిన దేరింగుల నాగరత్న (45) పై ఆమె భర్త దేరంగుల నరసింహులు బుధవారం అర్ధరాత్రి భార్యపై అనుమానంతో రోకలి బడిసితో తలపై దాడి చేయడంతో తలకు పూర్తిగా గాయమై కింద పడి పోయింది అని తెలిపారూ. గాయపడిన నాగ రత్నను కడప ప్రైవేట్ హాస్పిటల్‌కి తర లించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతురాలు నాగరత్నకు నలుగురు పిల్లలు ఇప్పటికే ముగ్గురు పిల్లలకు వివాహాలు చేశారని నాగరత్న నరసింహులు నిత్యం గొడవపడే వారిని దీంతో భార్యపై అనుమానం పెంచుకున్న నరసింహులు అర్ధరాత్రి సమయంలో రోకలి బడితో తలపై దాడికి దిగారని స్థానికులు తెలిపారు.ఈ మేరకు వెంటనే సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించి నిందితుని కోసం గాలించగా అప్పటికే పరార్లో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి గాలించుతున్నట్లు పోలీసులు తెలిపారు

## క్షయ రహిత భారతకు యువతే మార్పుకు శక్తి



**లక్కిరెడ్డిపల్లి -సూర్య వాస్తవం :**భారతదేశంలో క్షయ వ్యాధి రహిత మార్పుకు యువతే శక్తిలా మారాలని ఎంపీడీవో రెడ్డయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద జోష్ కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. అనంతరం వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ పై యువత పాత్ర కీలకమని ప్రతి గ్రామంలో నిరక్షరాసులు ఉన్న వారికి క్షయ వ్యాధి గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ వ్యాధి వచ్చిన వెంటనే డాక్టర్ ను సంప్రదించి ప్రతి బుధవారం ఆయా గ్రామ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పేరు నమోదు చేసుకొని ఉచితంగా మందులు నెలకు రూ.1000 పొందవచ్చు అన్నారు. క్షయ వ్యాధి ఉన్న వారికి దగ్గు జలుబు జ్వరము కళ్ళు మంటలు ఇలాంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ లక్షణాలు ఉన్నవారు తప్పకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నజియా, రిజ్వాన్ బేగ్ వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గంగిరెడ్డి క్షయ వ్యాధి సూపర్వైజర్ హరి గంగన్న ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపిక

**- ఎస్‌జీఎఫ్ అండర్--19 సెలక్షన్స్‌లో శివక్రిష్ణ ప్రతిభ**
**- కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో సత్తా చాటి రాష్ట్ర జట్టుకు ఎంపిక**



**పత్తికొండ - సూర్య వాస్తవం :** పత్తికొండ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న జి. శివక్రిష్ణ రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. సెప్టెంబర్ 26న కర్నూలు డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్ సెలక్షన్స్‌లో శివక్రిష్ణ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు చిత్తూరు జిల్లా నగిరిలోని కేవీఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహిం చనున్న రాష్ట్ర స్థాయి అండర్-19 క్రికెట్ పోటీల్లో శివక్రిష్ణ పాల్గొననున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రేష్మ కౌసర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థి శివక్రిష్ణను ప్రిన్సిపల్ రేష్మ కౌసర్‌తో పాటు ఉపాధ్యాయులు మాధవీలత, మధుసూదన్, పీడీ రాజశేఖర్ నాయక్ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి కళాశాలకు, పత్తికొండ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఆదోని న్యాయవాదిపై దాడికి నిరసనగా పత్తికొండలో న్యాయవాదుల ఆందోళన

**- న్యాయవాది వై.ఆర్. మల్లికార్జునపై దాడిని ఖండించిన బార్ అసోసియేషన్**
**- న్యాయవాదుల భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** ఆదోని సీనియర్ న్యాయవాది వై.ఆర్. మల్లికార్జునపై జరిగిన దాడిని నిరసిస్తూ పత్తికొండలో న్యాయవాదులు ఆందోళన చేపట్టారు. గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు ఆధ్వర్యంలో కోర్టు ఎదుట నిరసన నిర్వహించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుబాబు మాట్లాడుతూ.. సీనియర్ న్యాయవాది మల్లికార్జునపై కక్షిదారులు దాడి చేయడం అన్యాయమన్నారు. దాడి ఘటనపై బాధిత న్యాయవాది పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, ఫిర్యాదు కంటెంట్ ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరినప్పటికీ, పోలీసులు తమకు అనుకూలమైన బెయిలబుల్ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆరోపించారు.ఆదోని బార్ అసోసియేషన్ పిలుపు మేరకు మల్లికార్జునకు మద్దతుగా పత్తికొండలో నిరసన చేపట్టినట్లు మధుబాబు తెలిపారు. న్యాయవాదులపై దాడులను అరికట్టి, వారికి భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు కారప్ప, సురేష్, గోపాల్‌రెడ్డి, నాగేష్, రంగస్వామి, నారాయణస్వామి, సురేంద్ర, జరంగిరాజు, నరసింహచారి, జగదీశ్, నెట్టేకల్లు, వెంకటేశ్వర్లు, ఇలియాజ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## కర్నూలు ఎస్పీని కలిసిన పత్తికొండ నూతన డీఎస్పీ

**- బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో మర్యాదపూర్వక భేటీ**
**- నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ వంశీధర్ గౌడ్‌కు ఆదేశం**



**కర్నూలు క్రైమ్ - సూర్య వాస్తవం :** పత్తికొండ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వంశీధర్ గౌడ్ కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పత్తికొండ సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ, శాంతియుత వాతావరణం నెలకొల్పేలా సమన్వయంతో పని చేయాలని డీఎస్పీకి సూచించారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 .

# గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులోకి..

**- గ్రూప్-1, గ్రూప్-2 అభ్యర్థులకు ఉపయోగపడే నూతన మెటీరియల్..**



**కణేకల్ - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌కు అనుగుణంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన నూతన పుస్తకాలను కణేకల్ శాఖా గ్రంథాలయంలో అందుబాటులోకి తీసుకొచ్చారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ అనంతపురం ఆధ్వర్యంలో గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను గ్రంథాలయానికి పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్, కార్యదర్శి శివప్రసాద్ ఆధ్వర్యంలో అందు బాటులోకి వచ్చిన నూతన పోటీ పరీక్షల పుస్తకాలను గురువారం కణేకల్ శాఖా గ్రంథాలయంలో ప్రధానో పాధ్యాయులు రంగనాథం, ఉపాధ్యాయులు రమేష్, గ్రంథా లయ పాఠకుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రంగనాథం మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఎప్పటికప్పుడు తాజా సమాచారంతో కూడిన మెటీరియల్ ఎంతో అవసర మన్నారు. ప్రస్తుతం గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు ఉపయోగపడే నూతన, అప్‌డేటెడ్ పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులోకి రావడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు.

అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. గ్రంథాల యాధికారి డి. మల్లికార్జున మాట్లాడుతూ కణేకల్ మండల పరిధిలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రతి ఒక్కరూ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను వినియోగించుకోవాలని కోరారు. నూతన పుస్తకాల ద్వారా అభ్యర్థులు తమకు అవసరమైన జ్ఞానాన్ని పెంపొందించు కుని ఉద్యోగాలు సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రాప్తాడులో ఈ--పంట నమోదుపై జాయింట్ కలెక్టర్ సూపర్ చెక్

**- రైతులతో మాట్లాడి పంటల సాగు వివరాలు తెలుసుకున్న జేసీ**
**- క్షేత్రస్థాయిలో చీనీ పంట సాగును పరిశీలించిన సి. విష్ణు చరణ్**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** రాప్తాడు ఖరీఫ్--2026 సీజన్‌కు సంబంధించి రాప్తాడు మండలంలో నమోదైన ఈ--పంట వివరాలను జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి సూపర్ చెక్ నిర్వహించారు.రాప్తాడు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 337-4బిలో సాగు చేస్తున్న చీనీ పంటను, సర్వే నంబర్ 337-4దీలో సాగు చేస్తున్న చీనీ పంటను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత రైతులతో నేరుగా మాట్లాడి వారు సాగు చేస్తున్న పంటలు, సాగు పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసు కున్నారు.ఈ--పంటలో నమోదైన పంట వివరాలు క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఉన్న సాగు పరిస్థితులతో సరిపోలుతున్నాయా లేదా అనే అంశాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ--పంట నమోదు ప్రక్రియలో క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వివరాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## అనంతపురం రూరల్ ఎస్‌డీపీవోగా అశ్విన్ మణిదీప్ బాధ్యతలు

**- ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఎస్‌డీపీవో**
**- శాంతిభద్రతల పరిరక్షణపై ఎస్పీ పలు సూచనలు**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం రూరల్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఎస్పీ అశ్విన్ మణిదీప్ గురువారం జిల్లా ఎస్పీ పి. జగదీష్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు.రూరల్ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజా సమస్యలపై త్వరితగతిన స్పందించడం తదితర అంశాలపై ఎస్పీ పలు సూచనలు చేశారు. ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువగా ఉండేలా పనిచేయాలని సూచించారు.

## 23వ రోజుకు చేరిన వీఆర్ఏల సమస్యల నిరాకరణ దీక్ష



**పామిడి - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు గతనెల 16 నుండి ప్రారంభమైన నిరవధిక నిరాకరణ దీక్ష (సమ్మె) నేటికి 23వ రోజుకు చేరింది.పామిడి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముంగిట23వ రోజు శాంతియుతంగా నిరసన దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడం బాధాకరమని, గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న వీఆర్ఏలు రాత్రింబవళ్లు పని చేస్తున్నా, కనీస వేతనం కూడా లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని,తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అందుకు విరుద్ధంగా ఏపీలో మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. మేము కష్టంకు తగిన కోరికలు మాత్రమే కోరామని, అర్హత ఉన్న గ్రామ రెవెన్యూ సహాయ కులకు విఆర్ఏలుగా పదోన్నతి కల్పించాలని, అర్హత లేని వారికి వాచ్ మెన్,అటెండర్లుగా పదోన్నతి కల్పించాలని, పదోన్నతి కోటాను 30శాతం నుండి 70శాతంకి పెంచాలి, మామూలుగా పనిచేస్తున్న వారిని శాశ్వత గ్రామ రెవెన్యూ సహాయకులుగా నియమించాలని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి మాడిమాండ్లు పరిష్కరించకపోతే, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గురువారం పత్రికా సమావేశంలో తెలియజేసారు.

## ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌పై అవగాహన

**- ఐసీడీఎస్ సిబ్బందికి చట్టాలపై అవగాహన సదస్సు**





**రాయదుర్గం - సూర్య వాస్తవం :** రాయదుర్గంలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ నిర్వహణ, సేవలపై న్యాయశాఖ అధికారులు, న్యాయవాదులు, సభ్యులకు అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ రాయదుర్గం జడ్జి ఎం. రమ్య ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులు వసుంధర, రవిచంద్ర, వన్నూరు స్వామి, ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ సభ్యులు డి. రామాంజనేయులు, హెడ్మాస్టర్ సత్యనారాయణతో, సీనియర్ విలేకరి ఖాజా హుస్సేన్ పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు. కుటుంబ సమస్యలు, భార్యాభర్తల మధ్య వివాదాలు, గృహహింస, బాల్య వివాహాలు వంటి అంశాల్లో బాధితులకు ఎలా సహాయం అందించాలనే విషయాలపై చర్చించారు. అదేవిధంగా ఐసీడీఎస్ శాఖ సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఇతర సభ్యులతో కలిసి రాయదుర్గం మండలంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయదుర్గం అర్బన్ సీఐ దేవానంద్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, గృహహింస వంటి ఘటనలు తమ దృష్టికి వస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఐసీడీఎస్ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే గ్రామాల్లో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో 100కు ఫోన్ చేస్తే పోలీసులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటారని సీఐ దేవానంద్ స్పష్టం చేశారు.

## ఘనంగా ఓబులాపురంలో గ్యార్మీ వేడుకలు

**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి మండలంలోని ఓబుళపురంగ్రామంలో ముళ్ళ సిద్దయ్య ఆధ్వర్యంలో గురువారం జండా కట్ట దగ్గర గ్యార్మీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ముస్లిం యువకులు నిష్టాగరి ష్టులై భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు.ఈసందర్భంగా ముస్లిం సోదరుడు ముళ్ళ సిద్ధయ్య మాట్లాడుతూ గ్యార్మీ పండుగను ఎంతో సంతోషంగా, భక్తి శ్రద్దలతో జరుపుకుంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడుచుకోవాలని, ఇతరుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నారు అనంతరం బంధువులకు స్నేహితులకు ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. బంధువులు తదితరులు పాల్గొన్నారు.



## గుంతకల్లు సబ్ డివిజన్‌లో విస్తృత కార్డన్ సెర్చ్

**- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసుల ముందస్తు చర్యలు**
**- 350 ఇళ్లలో తనిఖీలు.. 41 రికార్డులు లేని ద్విచక్ర వాహనాలు స్వాధీనం**
**- పాత నేరస్తులు, అనుమానితులకు కౌన్సెలింగ్ డీఎస్పీ శ్రీనివాసరావు**





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** గుంతకల్లు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు గుంతకల్లు సబ్ డివిజన్ పరిధిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మొత్తం 350 ఇళ్లను తనిఖీ చేసి, పాత నేరస్తులు, అనుమానిత వ్యక్తుల ఇళ్లలోనూ తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా సరైన రికార్డులు లేని 41 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి వాటి వివరాలను పరిశీలించారు.అలాగే గతంలో నమోదైన ఎన్‌డీపీఎస్ కేసుల నిందితులు, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జిల్లావ్యాప్తంగా పోలీసుల నిఘా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

## సేవా జ్యోతి యాత్ర వికసిత్ భారత్ సంకల్ప సభలో పాల్గొన్నఆదినారాయణ యాదవ్



**అనంతపురం సిటీ - సూర్య వాస్తవం :** శ్రీ సత్య సాయి జిల్లాలో నిర్వహించిన "సేవా జ్యోతి యాత్ర" మరియు "వికసిత్ భారత్ సంకల్ప సభ" కార్యక్రమాల్లో రాష్ట్ర యువ మోర్చా ఉపాధ్యక్షుడు ఆదినారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాలు, దేశ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని ఆదినారాయణ యాదవ్ పేర్కొన్నారు.సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావడంతో పాటు సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.